వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 18 మే 2023


## సాగు, తాగునీటి వెతలు తీర్చేందుకే చెరువుకు నీరు

పులివెందుల, మే 17, ప్రభాతవార్త ః



నీటిలోకి పూలు చల్లి పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రైతులు, లింగాల ప్రజల సాగు, తాగునీటి వెతలు తీర్చేందుకే కులికాలువ నుండి చెరువుకు నీరు నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. నీటిలోకి పువ్వులను వేసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు వైఎస్ అభిషేక్‌రెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల అభిప్రాయం మేరకే నష్ట పరిహారం అందజేస్తాం

### - ఆర్డీవో రంగస్వామి

లక్కిరెడ్డిపల్లె, మే 17, ప్రభాతవార్త:



కాలేటి వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు రైతుల అభిప్రాయం మేరకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని ఆర్డీవో రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో కుర్నూతల, మద్దిరేవుల, దిన్నెపాడు, దప్పేపల్లె, కస్తూరి రాజుగారిపల్లె గ్రామాలకు చెందిన రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కాకుండా రైతులు కోరిన అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం చెల్లించే విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్ రాజు, సర్వేయర్ కరీముల్లా, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

# క్రీడా మైదానానికి నోచుకోని బద్వేలు

### క్రికెట్ ఆడాలంటే కడపకు వెళ్ళాల్సిన పరిస్థితి - వాకింగ్‌ను అనువైన స్థలం లేక ఇక్కట్లు

### గ్రౌండ్ ఏర్పాటుపై సందిగ్ధత - పట్టించుకోని అధికారులు - మున్సిపాలిటీ ఏర్పడి 15 ఏళ్లు దాటినా పంచాయతీ పాలనే!

బద్వేలు, మే 17 ప్రభాతవార్త :

బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడి 15 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంత వరకూ మున్సిపాలిటీలో పార్కు గానీ, క్రీడా మైదానం గానీ, వాకింగ్‌కు అనువైన మైదానం గానీ లేకపోవడం దురదృష్టకరంగా భావిస్తున్నారు ప్రజలు. గ్రేడ్-3 మున్సిపాలిటీ నుండి గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారినా పంచాయతీ పాలనలో సాగిన పరిపాలన సాగుతుంది తప్ప ఇది మున్సిపాలిటీ అని ఎక్కడే గానా అభివృద్ధి ఆనవాళ్ళు కూడా కనపడవు. మున్సిపాలిటీ ఏర్పడిందంటేనే పార్కులు, క్రీడా మైదానాలు ఉంటేనే ఆ మున్సిపాలిటీకి హంగు, ఆర్భాటం వస్తుంది. అలా కాకుండా కేవలం రోడ్లు వేసినంత మాత్రాన మున్సిపాలిటీ ఏర్పడినట్లు కాదని బద్వేలు ప్రజలు మండి పడుతున్నారు. పన్నుల రూపంలో కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నా, పట్టణం రోజు రోజుకూ పెరిగిపోతున్నా ఇక్కడ మాత్రం మచ్చుకు కూడా ఒక్క పార్కు కనపడదు. ఇదిలా ఉంటే క్రీడా మైదానం లేక క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడో దూర ప్రాంతానికి వెళ్ళి ఆటలు ఆడుకోవలసిన దుస్థితి ఏర్పడింది. బద్వేలు ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు కళాశాలల్లో ఎంతో మంది క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌బివిఆర్ కళాశాలలో మాత్రమే గ్రౌండ్ ఉన్నా అక్కడ ఆంక్షలు ఉండడంతో అందరికీ అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే ప్రతి క్రీడాకారుడు తమ నైపుణ్యం చాటుకోవడమేగాక జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం బద్వేలు క్రీడాకారులకు ఉన్నా వసతులు లేక వెనుకబడి పోతున్నారు. పాలకులు వారి స్వార్థం తప్ప బద్వేలు అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదని ప్రజలు మండి పడుతున్నారు. అధికారులైనా పట్టించుకుంటారేమో అని ఎదురుచూసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. ఈ మధ్య కాలంలో క్రికెట్ ఆడే క్రీడాకారులంతా కలుపుకొని ఆట ఆడాలని నిర్ణయించుకొని సరైన గ్రౌండ్ లేక కడపకు వెళ్ళి ఆడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. బద్వేలు క్రీడాకారులు కడపకు వెళ్ళి ఆటలు ఆడుతున్నారంటే ఇక్కడ ఏ మాత్రం సౌకర్యాలు ఉన్నాయో కనపడుతుంది. ఇదిలా ఉంటే కోట వీధిలో ఒక ప్రైవేట్ స్థలంలో క్రీడాకారులంతా చందాలు వేసుకొని చిన్న గ్రౌండ్ తయారు చేసుకొని నెట్టు కట్టి క్రీడలు ప్రాక్టీస్ చేస్తున్నారు. స్థోమత లేకపోయినా చందాల రూపంలో వసూలు చేసుకొని క్రీడాలు ఆడాలనే ఉత్సాహంతో వారి దగ్గర ఉన్న డబ్బులు కూడా గ్రౌండ్‌కు ఖర్చు పెట్టుకొని ఆటలు ఆడుతున్నా మన పాలకులు, అధికారులకు కొద్దిగా కూడా చీమ కుట్టినట్లుగా లేదంటే ఇంత కంటే దయనీయమైన పరిస్థితి మరొకటి ఉండదనిపిస్తుంది. ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేస్తుంటే చూస్తున్నారే తప్ప ఒక గ్రౌండ్ కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ఉన్నారు. జిల్లా వాసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉన్నా ఈ ప్రాంతంలో పార్కులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకునేందుకు నిధులు కూడా అడిగి తెచ్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. తక్కువ ఖర్చుతో క్రీడా మైదానాలు ఏర్పాటయ్యే పరిస్థితి ఉన్నా బద్వేలుపై పాలకులు సవతి ప్రేమ చూపిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుందని ప్రజలు మండి పడుతున్నారు.



ప్రైవేట్ స్థలంలో నెట్‌ను ఏర్పాటుచేసి ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

#### క్రికెట్ ఆడేందుకు కడపకు వెళ్ళాం



రాయల్ బుల్లెట్ కెప్టెన్: క్రికెట్ ఆడేందుకు సరైన మైదానం లేకపోవడంతో దాతల సహకారంతో సొంత డబ్బులతో ప్రైవేట్ స్థలంలో చిన్న గ్రౌండ్ తయారు చేసుకొని నెట్ ఏర్పాటు చేసుకొని క్రికెట్ ప్రాక్టీస్ చేసినా ఆడేందుకు సరైన గ్రౌండ్ లేక కడపకు వెళ్ళి ఆడుకోవలసిన దుస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడి బద్వేలులో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే ఎంతో మంది క్రీడాకారులకు ఉపయోగపడుతుంది.

-సింగసాని శివ కుమార్,

#### క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా పట్టించుకోని అధికారులు-



బద్వేలులో ఎంతో మంది వివిధ రకాలైన క్రీడలు ఆడేందుకు ఉత్సాహం చూపుతున్నా సరైన వసతులు లేక ఎంతో మంది నిరుత్సాహానికి గురవుతున్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలనుకున్నా ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తేనే జిల్లా, రాష్ట్ర స్థాయిలో వారి ప్రతిభను చాటగలరు.

-కాల్వ చెన్నయ్య, క్రీడాకారుడు

## కేంద్రం రైతులకు డ్రిప్ కోసం నిధులు ఇస్తున్నా జగన్ సర్కార్ మోసం

### ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు మళ్లింపు

### బిజెపి ప్రజాఛార్జి షీటులో రాష్ట్రనేత సాయిలోకేష్ ధ్వజం

రాజంపేట అర్బన్, మే 17 ప్రభాతవార్త



రాజంపేట ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ప్రజాఛార్జీ షీటు సభలో మాట్లాడుతున్న సాయిలోకేష్

రాష్ట్రంలో జగన్ సర్కార్ రైతులను, యువతను, ఎస్‌సి ఎస్‌టిలను మోసం చేస్తుందని బిజెపి రాష్ట్ర పొలిటికల్ ఫీడ్‌బ్యాక్ కమిటి సభ్యుడు సాయిలోకేష్ ధ్వజమెత్తారు. బుధవారం బిజెపి ప్రజా ఛార్జిషీటు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను బయట పెట్టేందుకే ప్రజా ఛార్జిషీటు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వెల్లడించారు. ప్రజలను మోసం చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పిఎంకెఎస్‌వై పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌కు 400 కోట్లు అందిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు డ్రిప్ సౌకర్యం అందించకుండా మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను కూడా వాడేసి ఆ వర్గాలను దగా చేస్తుందన్నారు. రైతులకు ప్రతియేటా రైతుభరోసా కింద 12500 పంట పెట్టుబడికి ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసే 6 వేలతో కలిపి 12500 మాత్రమే అందిస్తూ రైతులను మోసం చేస్తుందన్నారు. గిట్టుబాటు ధర లేక టమోటా, మామిడి, బొప్పాయ సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. రాజంపేట నియోజకవర్గంలో అరటి రైతులు ప్రతియేటా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రైతు పండించిన పంటకు టోల్ పన్ను కేంద్రం రద్దు చేసినా పుల్లంపేట మండలం పుత్తనవారిపల్లె వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్‌కమిటి టోల్‌గేటులో రైతుల నుంచి 1500 వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అన్నమయ్య డ్యామ్ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. కేంద్రం రాజంపేట కేంద్రియ విద్యాలయానికి 19 కోట్ల నిధులు మంజూరు చేసినా భూమి కేటాయించేందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అర్బన్ సిఐ నరసింహారావును బిజెపి నేతలు కలిసి ప్రజాఛార్జిషీటు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఎస్.షబ్బీర్, సురేష్‌రాజు, సుభద్ర, పలువురు రైతుసంఘం నేతలు, రాజంపేట నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరోకరి పరిస్థితి విషమం

### మద్యం మత్తులో డ్రైవింగ్, బైక్ పైన వస్తున్న ఇద్దరు యువకులును గుద్దిన బోలోరోపికప్ వాహనం

రాజుపాళెం, మే17, ప్రభాతవార్త.



ప్రమాదానికి గురైన బోలోరోపికప్ వాహనం
ప్రమాదంలో మృతి చెందిన బాబపకృద్దీన్ (ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ బోలోరోపికప్ వాహనంతో ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను గుద్దటంతో ఇద్దరు యువకులకు బలమైన గాయాలు తగిలి వెంకన్నపల్లె బాబాఫకృద్దీన్ (21)కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందాడు, కమ్మూబాయిగారి ఇస్మాయిల అనే మరోయువకుడి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యంకోసం కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై యస్ఐ రాజగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలలోకి వెళ్ళితే కొర్రపాడు గ్రామానికి చెందిన మృతుడు బాబాఫకృద్దీన్, ఇస్మాయిల్ అనే యువకులు ప్రొద్దుటూరు రిలయన్స్ మార్టులో పనిచేస్తూ పనిముగించుకొని రాత్రి ఇంటికి తిరుగు ప్రయాణంలో మోటారు బైక్ పైన ఒక్కనిమిషంలో గ్రామానికి చెరుకొనే సమయంలో గ్రామసమీపంలో చాగలమర్రి వైపునుండి ప్రొద్దుటూరు వైపు వెళ్ళు బోలోరో ఫికప్ వాహనం బలంగా గుద్దటంతో ఈప్రమాదం జరిగినది. ఈ ప్రమాదంనకు కారణమైన వాహనం డ్రైవరు మద్యం మత్తే కారణమని తెలుపుతున్నారు. ఈ ప్రమాదం జరిగిన తరువాత బోలోరో వాహనం డ్రైవరు వేగంగా పారిపోతూ కొన్ని నిమిషాల వ్యవధిలోనే గోపవరం గ్రామంలోని యస్‌సి కాలనీలోని మరుగుదొడ్డిని గుద్దాడు దీంతో వాహనం ప్రమాదానికి గైరై నిలిచిపోయినది. దీంతో ఎంతో భవిష్యత్ ఉన్న యువకులకు ఇలా జరగటంతో కొర్రపాడు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మద్యానికి బానిసగా మారి రోడ్డు ప్రమాదాలకు కారణం అయ్యేవారిని చట్టపరంగా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## కరాటే క్రీడ శరీర దృడవ్వాత్ని పెంచుతుంది

### సబ్ కలెక్టర్ ఫార్మన్ అహ్మద్ ఖాన్



రాజంపేట, మే 17 ప్రభాతవార్త :

క్రీడల్లో కెల్లా కరాటే కత్తి లాంటి దని రాజంపేట సబ్ కలెక్టర్ ఫార్మన్ మహ్మద్ ఖాన్ సూచించారు. కరాటే, బాక్సింగ్ కోచ్ ఆనంద్ ఆచారి ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ తరగతులను రాజంపేట లోని కె. వి. కె. స్టేడియంలో డి.ఎస్.ఏ. చీఫ్ కోచ్ షఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంకు అయన హాజరు అయ్యారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. క్రీడలో కెళ్ళ అత్యంత కష్ట మైనది కత్తి లాంటిది కరాటేక్రీడా అన్నారు. ఈ క్రీడ ఎంతో ధైర్యంను ఇస్తుందన్నారు. అదే విధంగా పదిమంది నైనా ఎదుర్కొన గలిగే శక్తిని తెలివి ని కూడ ఇస్తుందన్నారు. కరాటే క్రీడ చిన్న తనం నుంచే నేర్చు కుంటే భయం దరికి చేరదన్నారు. ఇలాంటి క్రీడలను నేర్పు తున్న కోచ్ ఆనంద్ ను అభినందించాలన్నారు. దీని పట్ల పిల్లల తల్లి దండ్రులు కూడా ముందు కొచ్చి పిల్లలను కరాటే క్రీడ పట్ల ప్రోత్స హించాలని చూసించారు. పిల్లలను కరాటే గురించి సబ్ కలెక్టర్ అడిగి తెల్సుకొని వారికి ధైర్యాని ఇచ్చారు.

## ఎన్‌హెచ్-67 నష్ట పరిహారంలో రైతులు కన్నీరు మున్నీరు

### రూ,20 లక్షల విలువచేసే సెంటుకు రూ 39 వేల పరిహారం

### ఆత్మహత్యలే శరణ్యం అంటున్న బాధితులు

గోపవరం, మే 17 ప్రభాతవార్త;



భూమిని కోల్పోతున్న బాధితులు

ఎన్‌హెచ్-67 భూమికి సంబందించిన నష్ట పరిహార విషయంలో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూన్నారు. ప్రైవేటుగా ఇక్కడ రూ,20 లక్షల విలువచేసే సెంటు భూమికి కేవలం రూ 39 వేల నష్ట పరిహారాన్ని ఇచ్చేందుకు అధికారులు ప్రకటించారు. ఇక తమకు ఆత్మ హత్యలే శరణమంటూ ఆగ్రామ రైతులు లబోదిబో మంటుంన్నారు. గోపవరం మండలం మడకలవారిపల్లెకు అతి దగ్గరగా ఎన్‌హెచ్-67కు సంబందించిన బైపాస్ రహదారి నిర్మితమవుతన్న విషయం తెలిసిందే. ఈ మేరకు భూ సేకరణ పనులు కూడా పూర్తయ్యాయి, ఇక్కడ స్దానిక రైతుల దగ్గర నుంచి 20 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేసారు. ప్రైవేటు మార్కెట్‌లో ఇక్కడ భూముల రేట్లు చుక్కలనంటుతున్నాయి, నష్ట పరిహారం కింద ఇచ్చే సొమ్ము కనీసం ఒక్క సెంటు కూడా కొనుగోలు చేయలేని పరిస్దితి. అయితే తొలిత ఇక్కడ ఒక ఎకరా భూమికి నష్టపరిహారంగా రూ,39.60.000గా నిర్ణయించిన ఓ అధికారి రైతుల నోట్లో మట్టకొట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకుపోగా వారు పెద్ద మనసుతో బాదిత రైతులను ఆదుకొనేందుకు ప్రత్యేక దృష్టితో ఒక్క ఎకరా భూమికి రూ, 1.44. 10.000కు పెంచడం జరిగింది. అయితే ఉన్నతాధికారులు సవరించిన మార్కెట్ వ్యాల్యూషన్‌ను ఎన్‌హెచ్‌ఏఐ వారు తిరస్కరించారు. ఈ మేరకు రైతులు తాము భూమిని కోల్పోయి ఏవిదంగా తమ కుటుంబాలను పోషించుకోవాల అని కన్నీరు మున్నీరుగా విలపిస్తూన్నారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని సంబందిత అధకారులు మానవతా దృక్పదంతో పరిశీలించి తమకు న్యాయం చేయకుంటే ఉద్యమాలతో పాటు ఆత్మహత్యలకు కూడా పాల్పడతామంటుంన్నారు.

## ఇన్నోవాను ఢీకొన్న ఒమినీ ఐచర్

### - ఒకరు మృతి, పలువురికి గాయాలు

బి.కొత్తకోట, మే 17, ప్రభాతవార్త:



ఇన్నోవా వాహనాన్ని ఒమిని ఐచర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన బి.కొత్తకోట మండల పరిధిలో జరిగింది. కదిరికి చెందిన మహ్మద్ హబీబ్ తన స్నేహితులతో కలిసి తన ఇన్నోవా వాహనంలో స్నేహితుడు మహబూబ్‌బాషా కువైట్‌కు వెళ్తుండగా అతనిని చెన్నై ఎయిర్‌పోర్టులో వదిలి తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు కదిరి నుంచి 12 గంటల ప్రాంతంలో బయలుదేరి వస్తుండగా ఎర్రమద్దువారిపల్లె వద్ద గుంటూరు నుంచి ఒమిని అశోక్ లైలాండ్ ఐచర్ వాహనం పచ్చిమిరపకాయల లోడుతో అతి వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న ఇన్నోవా వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నిజాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందగా ఇన్నోవా డ్రైవర్ సిర్దాన్ చేయి విరిగింది. అదే విధంగా కారులో ప్రయాణిస్తున్న ఇనయతుల్లా, ఇమ్రాన్, మహ్మద్‌లకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఒమినీ ఐచర్ డ్రైవర్‌కు సైతం గాయాలు కాగా అందరిని 108 వాహనంలో చికిత్సల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మీతి చెందిన నిజాముద్దీన్‌కు అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్సై రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చెరువులో పడి విద్యార్థి మృతి

### మరోకరి పరిస్థితి విషమం



మృతి చెందిన బాలాజీ

మదనపల్లెక్రైం, మే17 ప్రభాతవార్త :

చెరువులో పడి ఓ విద్యార్థి మృతి చెందగా, మరోక విద్యార్థి విషమంగా వుంది. ఈ విషాదకర సంఘటన మదనపల్లె రూరల్ మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె రూరల్ మండలం దుబ్బిగానిపల్లి పంచాయితీ గొల్లపల్లికి చెందిన సురేంద్ర, కుమారి దంపతుల కుమారుడు బాలాజీ (14), శ్రీనివాసులు, రమాదేవి దంపతుల కుమారుడు నవీన్ (14)లు అంగళ్లు సమీపంలోని బిసి హాస్టల్‌లో వుంటూ 8వ తరగతి చదువుతున్నారు. ప్రస్థుతం వేసవి సెలవులు కావటంతో 15 రోజుల క్రితం స్వగ్రామంకు వచ్చారు. బుధవారం పశువులను మేపటానికి గ్రామ సమీపంలోని రెడ్డివారిపల్లి చెరువు వద్దకు వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో చెరువులో ఆడుకోవటానికి వెళ్లారు. ఈతరాని వీరు ఆకస్మాత్తుగా చెరువులో పడిపోయారు. కొంతసేపటికి అక్కడే పశువులు మేపుతున్న ఓ వ్యక్తి గమనించి గట్టిగా కేకలు వేయటంతో గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని వారిని వెలికితీశారు. అప్పటికే బాలాజీ మృతి చెందగా, నవీన్ కొన ఊపిరితో వున్నాడు. వెంటనే ఇద్దరిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా వుండటంతో తిరుపతికి తరలించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందటంతో బాలాజీ తల్లిదండ్రులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## రాజంపేటలో ఇద్దరు విఆర్‌ఒలు సస్పెన్షన్

### రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా ఎంట్రీలతో ఒకరు...

### విధులకు సక్రమంగా రాక మరొకరు...

రాజంపేట అర్బన్, మే 17 ప్రభాతవార్త

రాజంపేట మండలంలో ఇద్దరు విఆర్‌లను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ గిరీషా పిఎస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బ్రాహ్మణపల్లె పొలాల్లో ఒకరి పేరుతో ఉన్న భూములను మరొకరి పేరుతో అడంగల్‌లో ఎంట్రీ చేయడంతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు సహకరించిన వ్యవహారంలో వి.రాఘవేంద్ర అనే విఆర్‌ఒను సస్పెన్షన్ చేశారు. అలాగే మదనగోపాలపురం విఆర్‌ఒ ఆరిఫ్ విధులకు సక్రమంగా హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు గత యేడాది సెప్టెంబరు 24 నుంచి ఇప్పటివరకు ఉన్నతాధికారులకు ఏమాత్రం సమాచారం లేకుండా, ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుండడంతో ఎస్.ఆరిఫ్‌ను సస్పెన్షన్ చేశారు. ఒకేరోజు ఇద్దరు విఆర్‌ఒలు సస్పెన్షన్ కావడం రెవెన్యూ వర్గాల్లో కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే రాజంపేట - రాయచోటి మార్గంలో కేంద్రియ విద్యాలయం భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వ భూముల కోసం సర్వే చేస్తున్న సమయంలో ఈ వ్యవహారం బయట పడింది. సర్వేనంబరు 301లో సంగరాజు సుబ్బరామరాజు అనేవ్యక్తికి 5.43 ఎకరాలు, సర్వేనంబరు 302లో ఎస్.విజయ్‌కుమార్‌రాజు 5.40 ఎకరాలు భూమి అసైన్డ్ చేశారు. ఈ భూములను విఆర్‌ఒ రాఘవేంద్ర, నటకల బాలాజీ, ఆయన భార్య నటకల త్రిపుర సుందరి పేరుతో ఆర్‌ఒఆర్ 1బిలో మాన్యువల్ రికార్డుల్లో ఎంట్రీ చేశారు. వెబ్‌ల్యాండ్‌లో కూడా ఎక్కించారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా వీరిద్దరికి ప్రభుత్వం అసైన్డ్ భూమి కేటాయించినట్లు సమాచారం లేదు. అయితే అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో ఎంట్రీ చేయడం అలాగే ఈ భూమి పక్కనే ఉన్న మరో ఐదెకరాల భూమిని కూడా వీరు ఆక్రమించారు. మొత్తం 15.79 ఎకరాల విలువైన భూమికి వీరు కంచె వేశారు. గత పదేళ్లుగా వీరు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. కేవలం 2 సెంట్ల పరిధిలో ఓ రేకులషెడ్ వేయడం మినహా మిగతా భూమి అంతా ముళ్లకంపలు మొలచి ఉంది. ఇదే విషయాన్ని తహశీల్దారు సుబ్రమణ్యం రెడ్డి, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య విచారించి అప్పటి ఆర్‌డిఒ కోదండరామిరెడ్డికి గత యేడాది డిసెంబరు 2న నివేదిక పంపారు. ఈ మేరకు ఆర్‌డిఒ కలెక్టర్‌కు కూడా నివేదిక పంపారు. ఈ నివేదికను పరిశీలించిన అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని కోఆర్డినేటర్ సెక్షన్ ఈ నివేదికను పరిశీలించి విఆర్‌ఒ సస్పెన్షన్‌కు సిఫారసు చేసింది. ఈ మేరకు కలెక్టర్ విఆర్‌ఒ రాఘవేంద్రను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ భూమిపై తమకే సర్వహక్కులు ఉన్నాయంటూ బాలాజి, త్రిపురసుందరిలు రాజంపేట జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దావా వేసి ఉన్నట్లు తెలుస్తోంది. దీనంతటికి కారణం విఆర్‌ఒ రాఘవేంద్రేనని విచారణలో తేలడంతో క్రమశిక్షణలో చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేశారు. ప్రస్తుతం రాఘవేంద్ర నందలూరు-1 విఆర్‌ఒగా పని చేస్తున్నారు.

## కావమ్మ మోసం... 10 లక్షల గోవిందా...

### అడిగితే హత్య చేస్తామంటున్న కుమారులు

### ఎస్‌ఐకి ఫిర్యాదు చేసిన ముస్లిం యువకుడు

రైల్వేకోడూరు, మే 17 ప్రభాతవార్త



ఎస్ఐ మోహన్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న జాకీర్

రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేటలో కొన్ని మోసాలు చేస్తూ ఎట్టకేలకు జాతకాలు చెబుతామని నమ్మబలికించి యువకులను నట్టేట ముంచుతున్న ఒక మహిళ తనవద్ద కల్లిబొల్లి మాటలతో 10 లక్షల రూపాయలను మోసం చేసిందని జాకీర్ అనే యువకుడు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మోహన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా వారికి ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో వెట్టిచాకిరి చేయించుకొని తనకు ఎటువంటి కూలీ ఇవ్వకుండా తన శ్రమను దోచుకొని చివరికి తనవద్ద నుండి కావమ్మ మాయమాటలు నమ్మి 10 లక్షల దాకా మోసపోయానని బాధితుడు ఎస్ఐ మోహన్‌కుమార్ వద్ద బోరున విలపించాడు. ముఖ్యంగా అదే పాలిటెక్నికల్ కళాశాలలో తన తల్లి జాతకాలు చెబుతుందని, పాఠశాలలో చదువుకుంటున్న అందమైన యువతులను పలురకాలుగా నయవంచనకు గురిచేసి వారిని చిత్రవద చేస్తున్నారని బాధితుడు ఎస్ఐ వద్ద రాతపూర్వకంగా తెలిపినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా ఈమెపై ఎన్నోమార్లు సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసిన ఎటువంటి ఫలితం దక్కలేదని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పిని రైల్వేకోడూరుకు వచ్చిన సందర్భంలో కలువలేకపోయానని, తమరైనా న్యాయం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి వారివద్ద నుంచి తాను పోగొట్టుకున్న 10 లక్షల రూపాయలను ఇప్పించాలని ఎస్ఐ మోహన్‌కుమార్ వద్ద జాకీర్ కన్నీరుమున్నీరయ్యారు. ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసినా వారి మాయమాటల్లో మోసాలు ఉన్నాయని, పాలిటెక్నికల్ కళాశాలలో బోగస్ పత్రాలతో కళాశాల నిర్వహిస్తున్నారని, తన తల్లి జాతకాలు చెప్పిన డబ్బులతో రాపూరు వద్ద మరో పాలిటెక్నికల్ కళాశాలను నిర్మిస్తున్నారని బాధితుడు ఆవేదనతో ఎస్ఐకి వివరించారు. పూర్తిస్థాయిలో దీనిపై విచారణ జరిపి తప్పక న్యాయం చేస్తామని మోహన్‌కుమార్‌గౌడ్ బాధితుడు జాకీర్‌కు తెలియజేశారు.

## శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు మార్తల వెంకటకృష్ణారెడ్డి

వార్త IVవ పేజీలో

## నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

- నిరంతరం నిఘాతోనే నేరాలకు అడ్డుకట్ట - కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

వార్త IVవ పేజీలో



## టిడిపిలో ఓసిలకో న్యాయం, బిసిలకో న్యాయమా?

మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి నాగరాజు, కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు మే 17, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి డటి ఎన్టియుసి జిల్లా అధ్యక్షులు షేక్ కుతుబుద్దీన్ తెలుగుదేశం పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించారని టిడిపి పార్టీ రాష్ట్ర శాఖ సస్పెండ్ చేసిందని, కానీ 300 మంది డాక్టర్ మహిళల సొమ్ము 40 లక్షల రూపాయలను అవినీతి చేసి దోచుకున్న పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మను సస్పెండ్ చేయక పోవడంలో ఆంతర్యం ఏమిటని మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీ దేవి నాగరాజు, మహిళా కౌన్సిలర్లు ప్రశ్నించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ తన చాంబర్లో ఆమె చైర్ పర్సన్‌గా కాకుండా చేనేత మహిళగా మాట్లాడుతున్నానంటూ తెలుగుదేశం పార్టీలో ఓసి మహిళా నేతకు ఒక న్యాయం బీసీ మహిళా నేతకు ఒక న్యాయము ఉంటుందా అని నిల దీశారు. పార్టీ సస్పెండ్ చేయాల్సింది గాజుల శివ జ్యోతి కుతుబుద్దీన్ ను కాదని ముందుగా భోగాల లక్ష్మీనారాయణమ్మను సస్పెండ్ చేయాల్సి ఉందన్నారు. బిసి మహిళపై టిడిపికి ఎందుకు ఇంత కక్ష్య అని ప్రశ్నించారు. గాజుల శివ జ్యోతి తప్పు చేసిందని భావిస్తే భోగాల లక్ష్మీనారాయణమ్మ కూడా తప్పు చేసినట్లే కదా సస్పెండ్ ఎందుకు చేయలేదో స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో మహిళా కౌన్సిలర్లు రావుల కొల్లు అరుణ పాల్గొన్నారు.

## మురుగునీటి శుద్ధీకరణ కేంద్రానికి స్థల పరిశీలన

ఎర్రగుంట్ల మే 17, ప్రభాతవార్త



ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని వలస పల్లె వంక పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న మురుగునీటి శుద్ధి కరణ కేంద్రానికి జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం కొరకు1.2 ఎకరాలు స్థలం అవసరం ఉండగా, ప్రభుత్వ స్థలం అందుబాటులో లేనందున ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసేందుకు రైతులతో చర్చలు జరిపి, స్థలాన్ని కొనుగోలు చేసి ఆ స్థలాన్ని మున్సిపల్ శాఖకు కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దారు నాగేశ్వరరావు, కమిషనర్ పి జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెద్దతిప్ప సముద్రం మే 17, ప్రభాతవార్త



మండలంలోని కందుకూరు వ్యాస రాయ సముద్రంలో ఓ గుర్తు తెలియని మృతి దేహాన్ని స్థానికులు గమ నించి పిటిఎం పోలీసులకు సమాచారాన్ని అందించారు. స్థానిక పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి గుర్తుతెలియని వ్యక్తి గా కేసును నమోదు చేశారు. మృతుడి ఆనవాళ్లను గుర్తుపట్టేలా అతను ధరించిన తెల్ల బనియన్ ఎరుపు నలుపు తెలుపు చారలు కలిగిన నైట్ ప్యాంటు దుస్తులను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు మృతుని వయసు 35 నుంచి 40 సంవత్సరాల లోపు ఉందని తెలిపారు. మృదుదేహాన్ని వెలికి తీసి పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించినట్లు స్థానిక ఎస్సై రవీంద్రబాబు తెలిపారు.

## 19 నుంచి 22వ తేదీ వరకు ఇంటర్వ్యూలు

– ఐసిడిఎస్ పీడి ధనలక్ష్మీ

రాయచోటి, మే 17 ప్రభాతవార్త:

ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడి ధనలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ఐసిడిఎస్ వివిధ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు 14, సహాయకురాలు 53, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 13 పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారిగా దిగువ తెలిపిన తేదీల్లో, సమయాల్లో మౌళిక పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఈనెల 19న ఉదయం 10 గంటలకు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యా లయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఈనెల 19న ఉదయం 10 గంటలకు రాజం పేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఈనెల 22న ఉదయం 10 గంటలకు రాయచోటి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకొని అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు వారి రెవెన్యూ డివిజన్‌కు కేటాయించిన తేదీలలో సూచించిన సమయంనకు కేటాయించిన ప్రదేశంనకు మౌఖిక పరీక్షకు వారి ఒరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకొని హాజరు కావాలన్నారు. ఒర్జినల్ సర్టిఫికెట్స్ లేని అభ్యర్థులకు మౌఖిక పరీక్షకు అనుమతించబడదన్నారు.

## ఎంపీకి వివాహ ఆహ్వానం అందించిన గంగాధర్‌రెడ్డి

పులివెందుల రూరల్, మే 17, ప్రభాతవార్త



పులివెందులలోని శ్రీకర్ కల్యాణ మండపంలో ఈనెల 9వ తేదీన జరగబోయే తమ కుమార్తె వివాహానికి తప్పకుం డా హాజరై ఆశీర్వదించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని పులివెందుల వైకాపా పట్టణ కన్వీనరు గంగాధర్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం పులివెందులలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గంగాధర్‌రెడ్డి కలిసి వివాహ ఆహ్వానం అందించారు.

## మరీ లోతుగా విచారించాలి

కడప సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి నజీర్

కడప వైద్యవిభాగం, మే 17, ప్రభాతవార్త:



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిన్నాన్న వివేకా హత్య కేసు దర్యాప్తు మరీ లోతుగా విచారించేలా చూడాలని సీబీఐ అధికారులను కడప సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి నజీర్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గారూ మీకు ఇది న్యాయమా.. కన్న తల్లిని, చెల్లిని తెలంగాణ రోడ్లపైన వదిలేశావు. అక్కడ ప్రభుత్వం రకరకాల ఇబ్బందులు పడుతఉంటే ఒక్క మాట అడగని నువ్వు ఇంకోపక్క మీ సొంత చిన్నాన్న కూతురు డా.సునీత మా నాన్నను చంపిం ది ఎవరు అని ఢిల్లీ నడివీధుల్లో సీబీఐ చుట్టూ హైకోర్టు సుప్రీంకోర్టుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటే వారికి న్యాయం చేయలేదు. మీ ముత్తాత రెండో కుటుం బం అయిన అవినాష్‌రెడ్డిని కాపాడాలని తపన, ఆత్రుత మీ రక్త సంబంధ మైన మీ కుటుంబపైన లేదే ఎందుకని ఏదో మతలబు ఉందనిపిస్తోందన్నారు. మీ అమ్మ విజయమ్మ, చెల్లెళ్ల అయిన షర్మిలమ్మ, సునీతమ్మకు న్యాయం చేయలేని మీరు రాష్ట్ర ప్రజలకు ఏదేదో చేస్తానని అబద్ధాలు చెప్పడం మీకే చెల్లుతుందన్నారు. సునీతమ్మకు న్యాయం చేయాల్సిందిగా సీబీఐని కోరుతున్నామన్నారు. కార్య క్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి, రాష్ట్ర బీసీ సెల్ కార్య దర్శి కోయిలకుంట శ్రీనివాసులు, డివిజన్ ఇన్‌చార్జిలు బండి జయశేఖర్, కొండ్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, కుంటశివ, పి.శ్రీనివాసులు, ఐటీడీపీ కార్యదర్శిరియాజ్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం, మే 17, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పట్టణం లో ప్రొద్దుటూరు టుటౌన్ సీఐ ఇబ్రహీం, త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలన్నారు. అతి వేగంతో డ్రైవింగ్ చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## భద్రతా సూత్రాలు పాటించండి... ప్రమాదాలు నివారించండి

సిఐ నరేంద్రరెడ్డి

చాపాడు మే 17, ప్రభాతవార్త



రహదారి భద్రత సూత్రాలు పాటించి, ప్రమాదాలను నివారించాలని మైదు కూరు గ్రామీణ సీఐ నరేంద్ర రెడ్డి, చాపాడు ఎస్ఐ మైనుద్దీన్లు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన చాపాడులో ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పిం చారు. ప్రమాదాలు తరచూ జరిగే చాపాడు, నాగుల పల గ్రామాల వద్ద (బ్లాక్ స్పాట్) దగ్గర ట్రాఫిక్ డ్రమ్ములు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగలు అరెస్టు

మదనపల్లెక్రైం, మే 17 ప్రభాతవార్త :

స్నేహితున్ని నమ్మించి అతని ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సిఐ సత్యనారాయణ తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె రూరల్ మండలం చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లికి చెందిన శ్రీనివాసులు (40), సుబ్రమణ్యం (40), వేంపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డిలు గత కొంతకాలంగా కలిసి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సుబ్రమణ్యం ఫైన్సాన్‌లో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అందుకు సంబంధించి నెలసరి వాయిదా చెల్లించటానికి రూ.50వేలు అవసరం కాగా, శ్రీనివాసులును అడిగాడు. శ్రీనివాసులు తనవద్ద లేదని, ప్రసాద్‌రెడ్డి ఇంట్లో నగదు వుందని దాన్ని దొంగతనం చేస్తే ఇద్దరం పంచుకుందామన తెలిపారు. దీనికి సుబ్రమణ్యం అంగీకరించాడు. ఈనెల 12వ తేది ప్రసాద్‌రెడ్డి భార్య ఊరికి వెళ్లటంతో, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డిని మద్యం గ్రామానికి దూరంగా తీసుకెళ్లి మద్యం తాపిస్తుండగా, ఆదే సమయంలో సుబ్రమణ్యం ప్రసాద్‌రెడ్డి ఇంట్లో తాళం పగలగొట్టి బీరువాలో వున్న రూ.4.40లక్షల నగదు, 40 గ్రాముల బంగారంను చోరీ చేసుకుని వెళ్లిపోయాడు. చోరీ చేసిన నగదులో రూ.2.20లక్షలను సుబ్రమణ్యం తీసుకుని, మిగిలిన పైకం, బంగారంను శ్రీనివాసులుకు అంద జేశాడు. ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలుసుకున్న ప్రసాద్‌రెడ్డి తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సిఐ సత్యనారాయణ సంఘటనా స్థలంకు చేరుకుని బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. క్లూస్‌టీమ్ సేకరించిన ఆధా రాల మేరకు సుబ్రమణ్యం, శ్రీనివాసులుచోరీ చేసినట్లు గుర్తించారు. నింది తుల కోసం గాలిస్తుండగా బుధవారం ఉదయం నక్కల దిన్నెక్రాస్‌లో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4.40లక్షల నగదు, బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

## వేదపండితులు అప్పలయ్యబట్ల రవిశాస్త్రి మృతి

పీలేరు, మే 17 ప్రభాతవార్తః



స్థానిక నె హ్రూబజారు వీధిలో నివాసం ఉన్న అప్పలయ్యబట్ల రవిశాస్త్రి(70) బుధవారం ఉదయం పరమపదించారు. ఎన్నో సంవత్సరాలుగా వేదవిద్యనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వీరు పీలేరులో అత్యంత ప్రాచీనమైన పురోహిత కుటుంబం నుంచి వచ్చిన వీరు 50 సంవత్సరాలపూర్వం నుంచి సనాతన వైదిక ధార్మిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ సనాతన వైదిక ధర్మాచరణములు చేయిస్తూ ఉండేవారు. వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు.

## బాజాపా ఆధ్వర్యంలో ప్రజా చార్జిషీటు కార్యక్రమం

పీలేరు, మే 17 ప్రభాతవార్తః



పీలేరు బాజాపా ఆధ్వర్యంలో ప్రజా చార్జిషీటు కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి ప్రాంతాన్ని తిరి గాను ప్రతి ఒక్కరి కష్టాన్ని విన్నాను. అన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీలను సైతం విస్మరించి ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడం జరుగుతుందని అదే తరహాలోస్థానికంగా ఉన్న వైఎస్సార్ నాయ కులు భూకబ్జాలు, ఇసుకె, మట్టి, మద్యం వ్యాపారాల్లో మునిగి వారి యొక్క లాభాపేక్ష ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆగమ్య గోచరంగా మారుస్తున్నారని అందులో భాగంగానే స్థానిక పీలేరు పట్టణం నందు అనేక ఎకరాలు భూకబ్జాకు గురైయ్యాయన్నారు. దీనిపై లోకాయుక్తలో ఎన్నిసార్లు ఫిర్యాదుచేయడం జరిగింది. వాటిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లను సైతం అక్రమాలకు గురిచేయడం జరుగుతుందని అంతేకాకుండా పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందాల్సిన జగనన్న కాలనీలను సైతం ఎక్కువ నాయకులు వారి అనుచరులకు వారి బినామీ పేర్లతో పూర్తి స్థలాలను ఆక్ర మించుకోవడం జరుగుతుందని ఇకనైనా ప్రజల కోసం పేదల ప్రభుత్వంగా చెప్పుకోబడుతున్న వైసీపీ ప్రభుత్వం పేదల కష్టాలను గమనించి అక్రమా లను నివారించాలన్నారు.అనంతరం ఎస్సై నరసింహుడికి బాజాపా నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యాక్షులు చంద్ర శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరమణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిమ్మనపల్లె పురు షోత్తం, తాతయ్య, రామాంజులు, అల్లాబక్షు, సుధారాణి, పలువురు భాజాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20 లీటర్లు సారా, 200లీటర్ల ఊట ధ్వంసం ముగ్గురిపై కేసు నమోదు

పీలేరు, మే 17 ప్రభాతవార్తః



రేగళ్ల పంచాయతీలోని తూ గుంటపల్లె వద్ద దాడులు చేయగా శివకుమార్, కష్ణయ్య, మునిలక్ష్మమ్మ అను ముగ్గురు వద్ద 20 లీటర్ల సారాయి, 200లీటర్ల ఊట కలిగి ఉండగా ధ్వంసం చేసి సారాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండుకు తరలించడమైందన్నారు. ఈదాడిలో ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్ ఎస్సై లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద, సురేష్, సుధాకర్, గంగా మహేశ్వరి పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

కలకడ, మే 17 ప్రభాతవార్తః



లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లవారిపల్లె గ్రామంలో నివాసమున్న మూగే రెడ్డి ప్రసాద్ ఐదు సంవత్సరాలుగా కలకడ మండలం మంగళపల్లె లోనివాసం ఉండేవాడని కలకడ మెయిన్ రోడ్డు పక్కన హెల్త్ కేర్‌మెడికల్ షాపు నడుపుతూ జీవనం సాగించేవారు. ఏప్రిల్ 28వ తేదీ బయటి ప్రాంతాలకు వెళ్లాడని ఎన్ని రోజులు గడిచిన రెడ్డి ప్రసాద్ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని భార్య కష్ణకుమారి కలకడ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు మేరకు కలకడ పోలీసు వారు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేఇస దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రెడ్డిబాబు తెలిపారు.

## సొంత ఊరిని మరవకండి

కేవి.పల్లె, మే 17 ప్రభాతవార్తః



మనం ఎంత గొప్ప పదవిలో ఉన్న జన్మించిన సొంత ఊరిని మరువరాదని కేవి.పల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి. రమణ అన్నారు. బుధవారం ఆపాఠశాలలో 1997-98 ఏడాది చదివిన పూర్వ విద్యార్తుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవభావం కలిగి ఉండి సమాజానికి తమవంతు సహకారం అందించాలన్నారు. పూర్వ విద్యార్థులు గ్రామంతో పాటు పాఠశాల అభివద్ధికి కూడా తమ వంతు కషిచేయాలని కోరారు. తమ ఉన్న తికి శక్తివంచన లేకుండా కషిచేసిన తల్లిదండ్రులను వద్ధాప్యంలో వారిని ప్రేమతో చూసుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థులు తమ విద్యార్థిదశ అను భవాలను సభకు వివరించారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపక లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, హరినాథ రెడ్డి, సురేంద్రరెడ్డి, సుబ్రమణ్యం విమలాచారి, అబ్దుల్ కలాం, సుశీల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ ఆర్ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

వాల్మీకిపురం, మే 17 ప్రభాతవార్తః

స్థానిక తరిగొండ రోడ్డులో వెలసిన ఏపీఆర్ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల తెలిపారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ-32, బైపీసీ-32- సీఈసీ-28 ఖాళీలు ఉన్నాయని 2022-23 సంవత్సరానికిఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉచిత వసతి, భోజనం సహాయంతో పాటు ఇంగ్లీషు మీడియం విద్యా బోధన, డిజిటల్ తరగతులు నిర్వహణ ఉంటుందన్నారు. మెనూ ప్రకారం భోజనం సదుపాయం కలదన్నారు. అర్హులైన మైనారిటీ విద్యార్తులు ఏపీఆర్ఎస్, ఏపీసీఎఫ్ఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పారాలను డౌన్‌లోడ్ చేసుకుని జూన్7వ తేదీలోగా కళాశాలలో అందించాలని లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా పంపవచ్చునన్నారు. మరెన్ని వివరాలు 8008304066ను సంప్రదించాలని ఆమెకోరారు.

## దేశంలోనే ఆదర్శ పాలన

వాల్మీకిపురం, మే 17 ప్రభాతవార్తః



రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం అందించని ఆదర్శ పాలన సాగిస్తుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారి పల్లె పంచాయతీ వడ్డిపల్లె, మల్‌రెడ్డిగారిపల్లె, ఎర్రంరెడ్డిగారిపల్లె గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తం భాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇళ్ల సమస్యలను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు, సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య బూమిక పోషిస్తు న్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జడ్పీటీసీ నిర్మల, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవినాయక్, సర్పంచి మునిభాస్కర్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ నరసింహులు నాయకులు చంద్రశేఖర్, ఆనంద, రాయుడు, వేణు గోపాల్‌రెడ్డి, రవి, విశ్వనాథం, రాజ బాబు, చిన్నోడు, చలపతి, సుబ్బుపట్టాభి పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు మే 17, ప్రభాతవార్త



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డు పర్యటించారు.వార్డు లోని ప్రజలతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నాడు. వార్డు సభ్యులు డ్రైనేజీ సమస్య, నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గ్రామం లో అందరి సహకారం లభిస్తే తప్పకుండా డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డుల్లో మ్యాప్పింగ్ కారణంగా రేషన్ కార్డు రానివారికి సచివాలయం వెళ్లి వాలంటీర్ల ద్వారా మ్యాప్పింగ్ చేయించుకోవలసినదిగా తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు మునిసిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర, వార్డు ఇంచార్జి తవ్వా చంద్రాఓబుళరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, కె.సి లింగన్న, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం

– మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

జమ్మలమడుగు, మే 17, ప్రభాతవార్త:

జమ్మలమడుగులో చికిత్స పొందుతున్న మార్గనెట్ అనే మహిళకు రక్తం అవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణరావును ఫోన్ ద్వారా సంప్రదించగా వారు వెంటనే స్పందించి మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ కామనూరు శివ సాయినాథ్ చేత 14వ సారి ఎ పాజిటీవ్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ లక్ష్మణరావు, శివసాయినాథ్, గురు రాజశేఖర్ పాల్గొన్నారు.

## నీబాబు ఏం చేశాడో చెప్పి అడుగు పెట్టు

ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాలెం, మే 17, ప్రభాతవార్త:



టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రొద్దుటూరుకు నీ బాబు చేసిన మేలేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని లోకేష్ కు రాచమల్లు సవాల్ విసి రారు. నారాలోకేష్ చేస్తున్న పాదయాత్ర ఎవరికోసం? ఆయన బాబును మళ్ళీ ముఖ్యమంత్రి చేయాలని అనుకుంటుంటే అది పొరపాటే అన్నారు ఎమ్మెల్యే. 2014-19 కాలంలో తెలుగు దేశం అధికారంలో ఉన్నప్పుడు మీబాబు నా నియోజకవర్గం ప్రొద్దుటూర ఎకు చేసిన మేలేమిటో చెప్పాలని, మీతండ్రి కొడు కులు అధికారంలో ఉన్నపుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేరు, అధికారంలోకి వస్తే ఏదైనా చేస్తామని చెప్పే హామిలను తెలుగుప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు ఎందుకు పాదయాత్ర చేస్తు న్నారో మీకే తెలియటంలేదని అన్నారు.లోకేష్ పాదయాత్రతో టిడిపికి ఎమైనా ఒరుగుతుందనుకుంటే వారి భ్రమే తప్ప జరిగేదేమి లేదని అన్నారు. శివాలయం సెంటరులో నా నియోజకవర్గం ప్రజలకు,ప్రొద్దుటూరు పట్టణంనకు చేసిన మేలు ఏమిటో చెప్పే ధైర్యం నీకుందా అని లోకేష్ ను ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే మా జగన్న పథకాలు అన్నీ కొనసాగిస్తామని మీరే చెప్పుకుంటున్నారంటే,మా పథకాలు భేష్అని ఒప్పుకోవటమే కదా అని అన్నారు. మేము ఎన్నికలలో ఇచ్చిన హామిలలో నేరవేరనిది ఒక్క మద్యపాన నిషేధం ఒక్కటే అది ఎందుకు చేయలేక పోయామో ప్రజలకు విరిస్తాం,ఇలా చెప్పేధైర్యంకానీ,ఒప్పుకోనే నిజాయితీ మీకు ఉందా అని అంటూ రైతు రుణమాఫీ, ద్వాక్రా మహిళల రుణాలు,అక్కచెల్లెమ్మల బంగారు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఎన్నికల ముందు పసుపు కుంకుమ పూశారు అని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వెలవలి నారా యణరెడ్డి, యార్డు మాజీ వైస్ చేర్మేన్ సూర్చ నారాయణరెడ్డి, సర్పంచ్ మహబూబ్ బాష, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి రూ. 3లక్షలు ఎమ్మెల్యే సొంత నిధులు

రాజుపాళెం,మే17,ప్రభాతవార్త



మండల పరిధిలోని వెలవలి గ్రామంలో యస్‌సి కాలనిలోని నూతన రామాలయ నిర్మాణానికి బుదవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.3 లక్షల సొంత నిధులను మండల ఉపాధ్యక్షులు గ్రామ నాయకులు నారాయణ రెడ్డి చేతులమీదుగా యస్‌సి కాలనీ వాసులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యస్‌సిలు వారికాలనీలో రామాలయం నిర్మించుకొనుటకు సహాయ పడాలని మా నాయకులు పెద్దలు నారాయణరెడ్డి కొరగా ఆయన వంతు సహకారంగా రూ.3లక్షలు ఇచ్చి టిటిడి ఆధ్వర్యంలో గుడిని నిర్మించుటకు పాటుపడగా ఇంకా నిధులు అవసరమని నన్ను కోరగా ఇచ్చిన మాట ప్రకారం నేడు రూ.3 లక్షలు నగదును అందించి గుడి నిర్మాణంనకు పూర్తి చేయటమే కాకుండా ఈనెల చివరిలో జరిగే ప్రారంభంనకు కూడా నేనే ఖర్చు భరిస్తానని,నాకుంటంబ సమేతంగా పాల్గోని హరిజనులతో కలిసి గొప్ప పండుగను జరుపుకుంటామని తెలిపారు. ప్రజానాయకుడు అంటే ప్రజల అభివృద్ధి, వారి కష్టాలలో పాలుపంచు కోవటం, సమస్యలున్న వారికి అండగా నిలిసి మనుసును గెలుచుకోవటమే నిజమైన నాయకుడి లక్షణాలు అని మేము నమ్మే సిద్ధాంతామని అన్నారు. యస్‌సి కాలనీ వాసులు ఎమ్మెల్యే రాచమల్లుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చేర్మేన్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ మహబూబ్ బాష పాల్గోన్నారు.

## నేడు బేతాయిపల్లెలో స్పందన

గోపవరం,మే 17 ప్రభాతవార్త;

మండలంలోని బేతాయిపల్లె సచివాలయంలో నేడు స్పందనా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపిడిఓ హరినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖకు సంబందించిన అధికారులు ప్రజలకు అందుబాటులోకి వారి గ్రామాలలోనే స్పందనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి సోమవారం, గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని గ్రామీణులు సద్వినియోగించుకోవాలన్నారు.

## ఊటుకూరులో ఉచిత కంటి వైద్య శిబిరం



రాజంపేట,మే 17 ప్రభాతవార్త;

రాజంపేట మండలం లోని ఊటుకూరు పంచాయతీలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరంను పంచాయతీ కార్యదర్శి జల్లి బాలకుమార్ ఏర్పాటు చేశారు. పంచాయతీలోని చుట్టు ప్రక్కల గ్రామాలలో అనేక మంది పేద వృద్దులు కంటి చూపును కోల్పోయి చికిత్స లు చేయించు కొను ఆర్థిక స్థోమత లేకపోవడంతో కార్యదర్శి బాలకుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పుల్లంపేట మండలం కు చెందిన ప్రత్యేక కంటి వైద్య డాక్టర్ అరవింద్ ను పిలిపించి కంటి వైద్య శిబిరం నిర్వహించడం చేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వఉద్యోగులలో ఇలాంటి సేవాబావం కలిగిన వారుండడం చాలా అరుధన్నారు. గత నెల రోజులు గా ఊ టుకూరు పంచాయతీ లో అనేకమంది ఆర్థిక స్థోమత లేని పేద వృద్దులు ఉన్నారన్నారు. ఆయన అభీష్టం మేరకు బుదువారం క్యాంప్ పెట్టడం జరిగింది అన్నారు. ఈక్యాంపు ద్వారా 60మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీరిలో 13మందికి ఆపరేషన్ అవసరంగా నిర్ధారణ చేయడం జరిగింది అన్నారు. వీరికి త్వరగా ఉచితంగా ఆపరేషన్ చేయించి వారికి ఉచితంగా అద్దాలు కూడా కార్యదర్శి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈపరీక్షలతో పాటు అనేకమంది కి బి. పి., షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది.

## ఆకారం సృష్టించుకున్నారు..

సర్వే నెంబర్లు లేవంటున్నారు..

- చెరువును సృష్టించి ఆపై కబ్జా

- ఆకారం లేని చెరువుకు కోట్లాది రూపాయలు ఖర్చు

- పనికి ఆహారం పథకంలో అందినకాడికి దోచుకున్న నాయకులు



ఓబులవారిపల్లె, మే 17, ప్రభాతవార్త:

అది అనగనగా ఓ అటవీ శివారు గ్రామమైన గాదెల చెరువు. ఆ చెరువుకు రూపురేఖలు సృష్టించుకున్నారు. సర్వే నెంబర్లు లేవు. యథేచ్చగా గత 2002లో తెదేపాలో ఓ కీలకనేత పనికి ఆహార పథకం కింద చెరువును తయారు చేయించి చెరువుకు మరమ్మతులు చేయించి చెరువుగా సృష్టించుకొని ఆ చెరువుకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. దాదాపు వంద ఎకరాలపైనే ఆ చెరువు ఉండేది. ఆ తరువాత గత 10 సంవత్సరాల లోపు అక్కడ ఆ చెరువు భూములు కొందరు బడా బాబుల కబంధ హస్తాలలో ఆక్రమణకు గురయ్యాయి. అంతేకాకుండా అటవి నుంచి వచ్చే నీటి వనరుల కోసం కాలువలు కూడా తవ్వించి ఆ కాలువలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి జేబులు నింపుకున్నారని చెప్పవచ్చు. ఏది ఏమైనా పనికి ఆహార పథకం ఆ నాయకుడికి కల్పతరువుగా మారింది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలకు సెంటు భూమి లేకపోయినా ప్రభుత్వం తమదే అంటూ తను చెప్పిందే వేదం, చేసిందే శాసనం అన్నట్లు అట్టుఅదుపు లేకుండా అక్రమార్జనకు తెరలేపారు. తవ్వేకొద్ది బయటకు వచ్చేంత అవినీతి అక్రమాలు జరిగినా కొందరు అధికారులు అప్పట్లో అధికార పార్టీ ఉన్నందున ఆమ్యామ్యాలతో సరిపెట్టుకొని అవినీతి పుట్ట బయట పడకుండా పాతిపెట్టినట్లు అక్రమార్జనకు తెరలేపారు. అంతేకాకుండా కోట్లాది రూపాయలు ప్రజా ధనం చెరువు పేరుతో నిరుపయోగంగా మారడంతో పాటు అక్కడ నిలిచిన నీరు ఒక ఎకరాకు కూడా సాగుకు పనికి వచ్చేలా లేదని చెప్పవచ్చు. ఎక్కువ శాతం చెరువులో ఉన్న భూమి ఆక్రమణకు గురికావడంతో చెరువఉలోకి నీరు రాక భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సర్వే నెంబర్లు లేని చెరువుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందుకు ఇరిగేషన్ అధికారులు, వాటిని పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు చొరవ చూపి చెరువు ఆక్రమిత రైతులపై కొరఢా ఝుళిపించకపోతే రాబోయే కాలంలో చెరువులో నీరు ఉండే పరిస్థితి ఉండదని పలువురు ప్రశ్నిసఉ్తన్నారు. ఇటీవల రూ.1.05కోట్లను చెరువు అభివృద్ధికి మంజూరైనా ఆ చెరువులో పనులు చేపట్టేందుకు ఏ నాయకుడు సాహసించకపోవడంతో ఆ నిధులు ప్రభుత్వ ఖజానాలో ఉన్నట్లు వెనుదిరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పునరాలోచించి చెరువులు, కుంటలు, ప్రజా ఆస్తులను పరిరక్షించకపోతే రాబోయే కాలంలో నీటి వనరుల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పోర్డ్‌సంస్థచే సత్కారం



మదనపల్లె, మే 17 ప్రభాతవార్త :

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు మొక్కలు పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మచే సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువతుతూ ఉత్తమ ఫలితాలను సాధించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజ మాన్యాలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని ఎంతోమందికి చదువులు కొనసాగించిన ఉపాధ్యాయులకు సంతోషంగా ఉందన్నారు. టెన్త్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మరిన్ని శిఖరాలను అదిరోహించాలని ఆకాక్షించారు. రాష్ట్రస్థాయిలో 595మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచిన మదనపల్లె విజయభారతి పాఠశాల విద్యార్థిని ఉన్నతిరెడ్డికి జ్ఞాపిక, దుశ్శాలువతో సన్మానించారు. వివేకానందస్కూల్‌కు చెందిన విద్యార్థినులు నందిని, హిమ సాయి, రాఘవవి, జడ్పిహైస్కూల్ విద్యార్థులు చాయాక్రిష్ణ, హోప్‌మున్సిపల్ స్కూల్ శ్రావణి,వివిధ స్కూల్స్‌కు చెందిన జి.వంశీ, పాతిమా, సురేష్‌కుమార్, తాజ్ విద్యార్థులకు సత్కరించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో పోర్డ్‌సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీధర్, మండల కోఆర్డినేటర్ రాధారాణి, ఆవుల నర సింహులు, సిబ్బంది అల్తాఫ్, సంపూర్ణ, ప్రభావతి, జ్యోతి పాల్గొన్నారు.

## మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి మద్దతు

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, మే 17 ప్రభాతవార్త :



అంతర్జాతీయ క్రీడావేదికలైన ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఏషియన్ గేమ్స్ పోటీలలో గోల్డ్, సిల్వర్ బ్రాంజ్ పతకాలను సాధించి భారతదేశం కీరి ప్రతిష్టలను ఇనుమడింప చేసిన మహిళా మల్లయోదులు రెజ్లర్స్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎస్ఐ అధ్యక్షులు ఎంపి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంగతేటు ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి మహిళా సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సాంబశివ మాట్లాడుతూ రక్షకుడే తమపై లైంగిక వేదింపులకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలన్నారు. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు ఒడిగడుతున్న నిందితులను కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన ఖండించారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న మహిళా రెజర్లు ఉద్యమానికి దేశప్రజలు మహిళలు క్రీడాకారులు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి దేవ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, మహిళా సంఘం నాయకులు గంగులమ్మ, మంజుల, సరళమ్మ, నాగరాణి, రాణెమ్మ పాల్గొన్నారు.

## విద్య, ట్రాన్స్‌కో అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

కురబలకోట, మే 17 ప్రభాతవార్త



విద, ట్రాన్స్‌కో అధికారుల పని తీరుపై మండల సర్వసభ్య సమా వేశం లో సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం కురబలకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దస్తగిరిసాబ్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి దస్తగిరి సాబ్, సర్పంచ్ ఆర్‌కె.క్రిష్టారెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్‌రెడ్డి కార్పోరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో అనేక వినూత్న పథకాలు ప్రవేశపెట్టి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నా కురబలకోట హైస్కూల్‌లో ఈ ఏడాది పదవతరగతి పరీక్షా ఫలితాలు దారుణంగా పడిపోయాయిని తెలిపారు. అక్కడి ఉపాధ్యాయులు బాధ్యతా రహితమేనని వారు ఆరోపించారు. ఆ ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కమతంపల్లె, ములకావారిపల్లె, నందిరెడ్డిగారిపల్లెల్లో లోడు అధికమై ట్రాన్స్‌పార్మర్లు ట్రిప్పు కావడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోందని దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని సర్పంచ్ ఆర్‌కె.క్రిష్టారెడ్డి, ఎంపి డిసి గోపాల్‌రెడ్డి, నందిరెడ్డిగారిపల్లె సర్పంచ్ తెలపగా లైన్ ఇన్స్‌పెక్టర్ మహేష్‌బాబు తగిన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు విరివిగా సరఫరా చేసినా ఇంతవరకు కనెక్షన్లు ఇవ్వలేదని తెలపగా గుత్తేదారులు స్థంభాలు నాటి లైన్లు లాగితే ట్రాన్స్‌కో సిబ్బంది జంపర్లు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇస్తామని లయన్‌ఇన్స్‌పెక్టర్ తెలిపారు. అంగళ్ళు నుంచి సిటిఎం ఆర్‌సికురవపల్లె, ముదివేడు, కురబలకోట మీదులుగా ఆర్టీసి బస్సులను నడపాలని జడ్పిటిసి బైసాని జ్యోతి, సర్పంచ్ సోమిరెడ్డి, ఎంపిటిసి గోపాల్‌రెడ్డి ఆర్టీసి అధికారులను కోరారు. అంగళ్ళులోని ఆయుర్వేద ఆసుపత్రి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ఆయుర్వేద వైద్యసేవలను మండల ప్రజలు వినియోగించుకునేలా ప్రజాప్రతి నిధులు, అధికారులు చొరవ చూపాలని ఆయుర్వేద డ్యాక్టర్ నాగ జ్యోతి కోరారు. సమావేశంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు పనితీరును సభ్యులు ప్రశంసించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ డిఆర్.ఉమాపతిరెడ్డి, ఆర్‌బికె.ఛైర్మెన్ శివశంకర్‌రెడ్డి, వైస్ ఎంపిపిపి భూదేవి, కోఆప్షన్ మెంబర్ ఎసానుల్లా, సర్పంచ్‌లు సోమిరెడ్డి, ఈశ్వర్, సుజాత, ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్, ఎంఈఓ ద్వారకనాథ్, వైద్యాధికారి క్రిష్టల్‌దాస్, ఏఎస్ఐ గజేంద్ర, ఈఓపిఆర్‌డి అబ్దుల్‌సుకూర్, వెలుగు ఏపిఎం నీరజ, గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు

కురబలకోట, మే 17 ప్రభాతవార్త :

మండలంలోని కడపక్రాస్ గ్రామ పంచాయితీ పరిధిలో బుధవారం రాణామిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ముదివేడు పోలీసులకు గాయాలు అయ్యాయి. ముదివేడు పోలీస్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ గజేంద్ర, హోమ్‌గార్డు మదూకర్‌రెడ్డిలు ద్విచక్రవాహనంలో ముదివేడుకు వెలుతుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొనడంతో గాయాలు తగిలాయి. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చికిత్సల నిమిత్తం మదనపల్లెకు తరలించారు.

## సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్

### – ఎస్పై మల్లికార్జునరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం

లక్కిరెడ్డిపల్లె, మే 17, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో లయన్ అశోక్ రెడ్డి, లయన్ షేక్ మహ్మద్, లయన్ శ్యామసుందర్‌రెడ్డి, రెడ్డి కీర్తిరెడ్డి, డా.సులోచనల ఆర్థిక సౌజన్యంతో టీబీ యూనిట్ రోగులకు పౌష్టకాహారాన్ని అధ్యక్షులు షేక్ మహ్మద్ న్యూట్రిషన్ ఫుడ్ అందజేయడం అభినందనీయమని ఎస్పై మల్లికార్జునరెడ్డి, ఆసు పత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకోసారి చొప్పున 6 నెలలకు సరిపడా న్యూట్రిషన్ ఫుడ్ అందజేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.నీలోఫర్ బేగం మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలు ఎనలేనివని ఇలాంటి సేవలను చూసి ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్‌చంద్ర, డా.సుభాషిని, డా.జీవన్‌కుమార్, ల్యాబ్ టెక్నిషియన్ ప్రసాద్‌రెడ్డి, కృష్ణ, టీబీ యూనిట్

## అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్, మే 17, ప్రభాతవార్త:

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని జీవన జ్యోతి పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక పాఠశాలలు జీవన జ్యోతి పేరుతో నిర్వహిస్తున్నారు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈవో రాఘవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పీఎస్‌యూ విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ఆర్ఎస్ఐఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆకాష్ బై జూస్ జేఈఈ నీట్, ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ తదితర కోర్సుల పేరుతో జీవన జ్యోతి స్కూల్ యాజమాన్యం విస్తృత ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులోని రిలయన్స్, చాచా నెహ్రూ, రమణ మహర్షి, సాయి పరమేశ్వర, పులివెందులలోని రిషీ, జమ్మలమడుగులోని కె.ఆర్.స్కూళ్లను లీజుకు తీసుకొని అన్ని పాఠశాలలను జీవనజ్యోతి స్కూళ్ల పేరుతో నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ నాయకుడు ఓబయ్య పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించండి

తంబళ్లపల్లె, మే 17, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని గర్భిణీలు, చిన్నారులు కచ్చితంగా వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలని ఎంపీహెచ్ఈవో వెంకటరమణ తెలిపారు. బుధవారం కోసు వారిపల్లె పంచాయతీలో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఒకటిన్నర సంవత్సరం వరకు చిన్నారులకు టీకాలు వేయించాలన్నారు. నవజాత శిశువులు బలంగా ఉండి ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు దోహదపడతాయన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలలో ప్రతి బుధ, శనివారాలు టీకాలు వేసే కార్యక్రమం ఉంటుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆర్‌వీవీ ఓపీ వీఐపీవీ, పీసీవీ, ఎంఆర్ వ్యాక్సిన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు అలిమ, రామలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకానికి భూసేకరణ

### రైతులతో ఆర్‌డిఓ రంగస్వామి ముఖాముకి

రామాపురం మే 17, ప్రభాతవార్త



స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధ వారం అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి ఎత్తిపోతల పథకానికి సంబంధించి రైతులతో ముఖాముఖిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కల్పనాయిని చెరువు. గోపగుడిపల్లి. గువ్వల చెరువు. కొండవాండ్లపల్లి హసనాపురం గ్రామాలోని రైతులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. మండలంలో జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం. సప్లై ఛానల్ లకు ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ కు కల్పనా చెరువు. గోపగుడిపల్లి. గువ్వల చెరువు .గ్రామాల పరిధిలో ఈ పథకం కింద 28. 53 ఎకరములు భూమినీ. హసనాపురం పెద్ద చెరువు నుంచి చిన్న చెరువుకు 10.63 ఎకరములు భూమి. కొండవాండ్ల పల్లి నుంచి కుమ్మర కుంట 7 ఎకరములు భూమి ఎత్తి పోతల పథకానికి ఈ భూమి అవసరమని నష్టపరిహారంగా ప్రభుత్వం నుంచి రైతులకు పరిహారం అందిస్తామని రైతులతో ముఖా ముఖిగా ఆయన మాట్లాడారు. ఈ పథకానికి సంబంధించిన భూమి విలువలను తయారు చేసి తమకు పం పాలని రామాపురం తాసిల్దార్ అరవింద్ కిషోర్‌కు సూచించారు. రైతుల నష్ట పోకుండా వారికి ప్రభుత్వం నష్టపరిహార్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్ ఆర్ఐ రవి ఇరిగేషన్ ఏఈ మహబూబ్ బాషా వీఆర్వోలు నరసింహులు. సుబ్బారెడ్డి. ప్రేమ్ కుమార్. రైతులు పాల్గొన్నారు.

## జయాపజయాలు ప్రజలు నిర్ణయిస్తారు

### కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి

ప్రొద్దుటూరు మే 17, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజక వర్గంలో ఓటమి ఎరుగని నాయకుడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అని ఏ నాయకునికైనా జయాప జయాలు ప్రజలు నిర్ణయిస్తారని కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి పేర్కొ న్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ టిడిపి ఇన్చార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి మాజీని చేస్తానన్న వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. గడి చిన మున్సిపల్ ఎన్నికలలో సొంత వార్డును గెలిపించుకోలేని ప్రవీణ్ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసి ఎమ్మెల్యే రాచమల్లును మాజీ చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రవీణ్ వాఖ్యలు చూస్తుంటే ఉత్తర కుమార ప్రగల్భాలే తప్ప మరొకటి కాదన్నారు. ముందుగా టిడిపి అభ్యర్థిత్వాన్ని అమ్ముకున్నాడని పట్టణంలో జోరుగా ప్రచారం సాగుతుందని అమ్ముకోకుండా కాపాడుకోవాలని ప్రవీణ్‌కు సూచించారు. 2014 నుండి 19 వరకు టిడిపి పాలనలో చేసిన అభివృద్ధి ఏంటో స్పష్టం చేయాలన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభు త్వంలో అభివృద్ధి చేశాం కాబట్టే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరనీయమన్న ధీమా ఎమ్మెల్యే రాచమల్లు దన్నారు. చంద్రబాబు పాలనలో నియోజక అభివృద్ధికి లక్ష రూపాయలు కూడా నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే రాచమల్లు నేతృత్వంలో ఇప్పటికే వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు కొన సాగు తున్నాయన్నారు. ఏ నాయకుడైనా ప్రజల ఆదరణ పొందాలంటే ప్రజల పట్ల ప్రేమ బాధ్యతతో పాటు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కౌన్సిలర్ స్థాయి నుండి ఆ మూడు గుణాలు కలిగి ప్రజాభిమానం పొందా డన్నా రు అందులో ఏ ఒక్కటైనా ప్రవీణ్‌కు ఉందా అని ప్రశ్నించారు ఇప్పటికైనా పైమూడు గుణాలతో ప్రజలకు చేరువైతే రాజకీయ భవిష్యత్తు ఉం టుందని సూచించారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎదల రాయప రెడ్డి కేకే కొండారెడ్డి పాల్గొన్నారు.

## కర్ణాటక అక్రమ మద్యం సీజ్

బి.కొత్తకోట, మే 17, ప్రభాతవార్త:



బి.కొత్తకోట మండల కేంద్రంలో అక్రమంగా కర్ణాటక మద్యం పట్టు పడి ఓ వ్యక్తి జైలు పాలైన సంఘటన మండల కేంద్రంలో వెలుగు చూసింది. పెద్ద తిప్ప సముద్రం మండలం కాయలపల్లికి చెందిన నాగరాజు(27) జీవనోపాధి కోసం బి.కొత్తకోటలో ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. మంగళవారం సాయంత్రం నాగరాజు కర్ణాటక నుంచి తన సొంత కారులో 288 టెట్రా ప్యాకెట్ల అక్రమ మద్యం తరలిస్తుండగా సమాచారం అందుకున్న బి.కొత్తకోట ఎస్పై రామ్మోహన్ తన సిబ్బందితో నాయనబావి, మోటుకు రహదారిలో కాపు కాచి నాగరాజును పట్టుకున్నారు. నాగరాజును అదుపులోకి తీసుకొని ఫార్చునర్ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ అక్రమ మద్యం ఎప్యాకెట్ల విలువ రూ.25వేలు ఉంటుందన్నారు. నెల రోజుల క్రితం బెంగళూరు ఆర్‌టీ నగర్‌లో గంజాయి స్మగ్లింగ్ కేసులో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నాగరాజు రాజమండ్రి, వైజాగ్ నుంచి గంజాయి తరలించి మదనపల్లె తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్పీలు శిక్షణ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలి

### – మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 17, ప్రభాతవార్త:



పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వంద సమైక్యల రీసోర్సు పర్సన్లకు స్థానిక స్మిత్‌రోడ్‌లో ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో జిల్లా రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి ఆర్పీలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవరత్నా ల్లోని వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత, టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలకు సంబంధించి విధి విధానాలను తెలుసుకొని లబ్ధిదారులైన సంఘ సభ్యులందరికీ సంక్షేమ ఫలాలు చేరేలా అలాగే మెప్మా కార్యక్రమాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించి సంస్థ ఉన్నతికి పాటు పడాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మెప్మా అధికారులు ఎఫ్రాయిం, గోపీనాథ్, డీఆర్పీలు జోసెఫ్, చంద్ర, శోభ, వంద సమైక్యల నుంచి ఆర్పీలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చింతలను కలిసిన ఎంపీపీ నూర్జహాన్

కలికిరి, మే 17, ప్రభాతవార్త:



వాల్మీకిపురం నియోజకవర్గం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని బుధవారం కలికిరి మండలం ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ ఎంపీడీవో గంగయ్య యాదవ్ కలిశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పలు అభివృద్ధి పథకాల వివరాలను ఎంపీపీ, ఎంపీడీవోలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోయి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంపీపీ నూర్జ హాన్‌కు సూచించారు. కార్యక్రమంలో కలికిరి మండలం వైసీపీ మైనార్టీ యువ నాయకులు వేంపల్లె బావాజీ, వేంపల్లె ఫయాజ్, కలికిరి వార్డు పంచా యతీ మెంబర్ సయ్యద్ నూర్ మహ్మద్ పాల్గొన్నారు.

## కలికిరిలో గస్తీలు నాస్తి.. చోరీలు జాస్తి..

### – రోజు రోజుకు పెరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలు

కలికిరి, మే 17, ప్రభాతవార్త:

కలికిరి మండలంలో రాత్రివేళల్లో పోలీసులు గస్తీలు నామమాత్రంగా ఉండడంతో ద్విచక్ర వాహనాల చోరీలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో రాత్రివేళల్లో పోలీసులు ముమ్మరంగా గస్తీలు తిరుగుతుండడంతో చోరీలు జరిగేవి కావు. ప్రస్తుతం ఒక నెల రోజుల నుంచి గస్తీలు తూతూ మంత్రంగా పోలీసులు చేపట్టడంతో ప్రతి నిత్యం ఏదో ఒక వీధిలో చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కలికిరిలో ఎస్పై పోస్ట్ ఖాళీగా ఉండడం ఆ పోస్టను భర్తీ చేయడంలో జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో చోరీలు అధికమవుతున్నాయి. గస్తీలను పర్యవేక్షించే ఎస్పై, సీఐలు లేకపోవడంతో పోలీసులు గస్తీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలికిరి ఎస్పైగా రావడానికి ఎస్పైలు ముందు కు రాకపోవడం రాజకీయ పార్టీ నాయకులు కలికిరి ఎస్పైగా ఎవరినీ ప్రతిపాదిం చకపోవడంపై ఎస్పై, సీఐ పోస్టుల భర్తీ జాప్యం జరుగుతోందని రాజకీయ నాయకులు అటు అధికారులు సైతం చర్చించుకుంటున్నారు. గతంలో కూడా ఎస్పై, సీఐలను బదిలీ చేస్తే వెంటనే ఎస్పై, సీఐలను నియమించేవారు. కానీ ప్రస్తుతం ఒక నెలగా ఎస్పై, సీఐలను నియమించలేదు. దీంతో పలు కేసులు సైతం దర్యాప్తు ముందుకు సాగడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి కలికిరికి ఎస్పైని, వాల్మీకిపురం సీఐని నియమించి కలికిరి మండలంలో రాత్రివేళల్లో గస్తీలు ముమ్మరం చేసి చోరీలు, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, గ్రామీణ ప్రాంత ప్రజలు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## రక్తపోటుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి : జెవివి




ప్రొద్దుటూరు అర్బన్ మే 17, ప్రభాతవార్త

ప్రజలు జీవనశైలి వ్యాధులలో ఒకటైన రక్తపోటు పైన అవగాహన కలిగి ఉండా లని జనవిజ్ఞాన వేదిక వ్యవ స్థాపక నాయకులు డా. డి. నరసింహారెడ్డి అన్నారు. జెవివి ఆధ్వర్యంలో ఈరోజు ప్రపం చ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును ఏర్పాటు చేయడమైనది. కార్యక్రమానికి జెవివి పట్టణ అధ్యక్షులు డా.శివారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధి డా. డి. నర సింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రక్తపోటు 120/80 ఉండా లని అంత కంటే ఎక్కువ ఉండడం అధిక రక్తపోటుకు సూచిక అని అన్నారు. గుండె, రక్తనాళాలు సరిగా పని చేయకపోవడం వల్ల అధిక రక్తపోటు వస్తుందని అన్నారు. ఇతర అనారోగ్యసమస్యలు, అవయవాల పనితీరు సరిగా లేకపోయినా రక్తపోటు వస్తుందని అన్నారు. అధిక రక్తపోటు వచ్చినవారు ఆహారంలో మార్పులు చేయాలని సూచించారు. శాస్త్రీయంగా మనం తీసుకునే ఆహారంలో ఉండే కూరగాయలు, ఆకు కూర ల్లోని ఉప్పు సరిపోతుందని మనం కేవలం రుచి కోసమే ఉప్పును అధి కంగా తీసుకుంటున్నామని అన్నారు. కొవ్వు పదార్థాలు తగ్గించాలని, ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ జీవనశైలిని శాస్త్రీయంగా కొనసాగించాలని అప్పుడే ఆరోగ్యంగా ప్రజలుంటారని అన్నారు. జంక్ ఫుడ్ తీసుకోవడం ఆపాలని అన్నారు. కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి సునీత, అడ్వకేట్ హరిత, కోఆర్డి నేటర్స్ అజర్, అక్షయ, గురప్ప, చరణ్, మహీధర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో వీఆర్ఏ రత్నం రాజు మృతి

ఎర్రగుంట్ల మే 17, ప్రభాతవార్త



ఎర్రగుంట్ల మండల పరిధిలో వీఆర్ఏ గా పనిచేస్తున్న రత్నం రాజు(50) విధి నిర్వహణ లో ఉండగానే ఒకసారిగా కుప్ప కూలి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కదిరి వారి పల్లె గ్రామానికి రత్నం రాజు కదా కొన్నేళ్లుగా వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. అయితే బుధవారం రీ సర్వే చేస్తుండగా ఎండ తీవ్రత అధికమై కింద పడి పోయా డు. వెంటనే అక్కడ ఉన్న స్థాని కులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలి పారు. వీఆర్ఏ మృతి పట్ల వీఆర్ఏ సంఘం నేతలు ఇతర విఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ శాఖ అధికారులు ఎమ్మార్వో ప్రగాఢ సంతాపం తెలిపారు.

## గంగమ్మకు ఎమ్మెల్యే సతీమణి దీలు బాణాలు సమర్పణ

తంబళ్లపల్లె, మే 17, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం పరసతోపు పంచాయతీ పరిధిలోని కోటకొండ గంగమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే కవితమ్మ అమ్మవారికి దీలు బాణాలు సమర్పించారు. ఉదయం తంబళ్లపల్లెలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద వందలాది మంది కళాకారులు చెక్క భజనలు కోలాహలం చేశాయి. అనంతరం తంబళ్లపల్లెకు చెందిన మహిళలు ఎమ్మెల్యే సతీమని కవితమ్మ వెంట దీలు బాణాలతో ఊరేగింపుగా కోటకొండ గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ మూడు మార్లు ప్రదక్షణ చేసిన అనంతరం అమ్మవారికి కవితమ్మ అర్చన, అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట సర్పంచ్‌లు పార్వతమ్మ, నీలూఫర్, ఎంపీటీసీలు సరోజమ్మ, కరీం, ఎంపీపీ భర్త నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ రామలింగారెడ్డి, శ్రీనివాసులు, మైనుద్దీన్, సింగల్ విండో మాజీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 21, 22 తేదిల్లో గిండి గంగమ్మ జాతర

తంబళ్లపల్లె, మే 17, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పం చాయతీ పరిధిలోని దిగువ గిండి గంగమ్మ జాతరకు పెద్ద ఎత్తున తరలి రావాలని నిర్వాహకులు తెలి పారు. ఈ గంగమ్మ జాతర ఈనెల 21, 22 తేదీల్లో వైభవంగా జరిగేటట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పులూరు వాండ్లపల్లె, బల్లా పురంపల్లె, కొత్తపల్లెకు చెందిన గ్రామస్తులు గండి గంగమ్మను గ్రామ గ్రామాన ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అమ్మ వారికి ఇంటింటా ప్రత్యేక వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు.

## డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ పరీక్షా ఫలితాలు విడుదల

కడప మే 17, ప్రభాతవార్త



కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అర్బన్ రీజనల్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితా లను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్ రెడ్డి విడుదల చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంతో కలిసి ఫలితాలను స్క్రీన్ పై విడుదల చేశారు. వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ మొదటి సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ లో 96 శాతం, ముడవ సెమిస్టర్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 76 శాతం, మూడవ సెమిస్టర్ అర్బన్ రీజనల్ ప్లానింగ్ 80 శాతం, ఐదవ సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ 80శాతం మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్ సైట్ లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ వై. పవన్ కుమార్ రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతులు సేంద్రియ పద్ధతులు అవలంభించాలి

### – రాష్ట్ర అధ్యక్షులు డా.తాహిర్

కడప వైద్యవిభాగం, మే 17, ప్రభాతవార్త:



కడప జిల్లాలో ఉన్న కొన్ని ప్రసిద్దిగాంచిన మామిడి తోటల్లోకి జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డా.ఎస్.ఎం.డి.తాహిర్ బుధ వారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ఉత్తమమని హానికర రసాయనాలు వాడకం ప్రభుత్వం నిషేధించాలని సూచించారు. చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకు ఇష్టంగా తినే పండు మామిడి పండే అని, మన జాతీయ పండు కూడా మామిడి పండే దానిని కాపాడుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ రోజుల్లో మామిడి విశిష్టత భిన్నంగా మారిందని, పూర్తి రసాయనిక పండుగా మారిందని పూత, పిందె దశ నుంచి అది మన చేతికి చేరే వరకు అనేక రసాయనాలు వాడి, కాయ పండుగా మారుటకు కూడా చైనా నుంచి దిగుమతి చేసుకున్న పౌడర్ వాడకం వలన అది కేవలం ఒక రసాయన ముద్ద లాగా అనిపిస్తుంది. కానీ రుచి సుచి ఉండవు. రసాయన మామిడి పండ్లు తినడం వల్ల అనేక రోగాలు, మామిడి పట్ల ఉన్న ఇష్టత కూడా తగ్గు తోంద న్నారు. మన భారత దేశ పండుగా పేరు గాంచి ప్రపంచంలోనే అధిక మామిడి దిగుబడి ఇచ్చే దేశాలలో మన దేశం ప్రథమ స్థానం, అటువంటి పక్షాన మన ప్రభుత్వాలు అధిక రసాయనాలు వాడకం తగ్గించడంలో సరైన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో దేశ మామిడి పండుకు అంతర్జాతీయ మార్కెట్‌లో విలువ, పేరును కోల్పోవాల్సి వస్తుందన్నారు.

## కారు యజమానికి కారు అప్పగించాలి

### – బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ

కడప వైద్యవిభాగం, మే 17, ప్రభాతవార్త:



ముద్దనూరుకు చెందిన శివసాయి చందు కారును అతనికి తిరిగి ఇవ్వాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ తెలిపారు. కడప వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు గ్రామ వాసి మంజుల శివసాయి చందు ఈనెల 6వ తేదీ జమ్మలమడుగు ఎమ్మెల్యే అనుచరుడు రామలింగారెడ్డి ఫంక్షన్‌కు వెళ్లాలని కారు అవసరం ఉందని తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. తీసుకున్న కారు తిరిగి ఇవ్వకుండా మీ నాన్న నాకు అప్పు ఉన్నాడని కారు తిరిగి ఇచ్చేది లేదని చందును బెదిరించడం సరైంది కాదన్నారు. ఈనెల 11న జిల్లా ఎస్పీని కలిసి రామలింగా రెడ్డిపై పిర్యాదు చేయడం జరిగతిందని ముద్దనూరు సీఐ దగ్గరకు వెళ్లి పిర్యాదు చేసినా వారికే వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి న్యాయం చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. తండ్రి డబ్బులు బాకీ ఉంటే కొడుకు కారు తీసుకెళ్లడం దుర్మార్గమైన చర్య అన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు రూరల్ మే 17, ప్రభాతవార్త



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు బుధవారం శ్రీ లక్ష్మి మహాయజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి హైదరాబాద్‌లోని తుక్కుగూడ ప్రాంతంలో నూత నంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి దంపతులను ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ ఆహ్వానించారు.

## స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముజీబ్

రైల్వేకోడూరు రూరల్, మే 17 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని వైసిపి మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎ అబ్దుల్ ముజీబ్ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎంతోకాలంగా రైల్వేకోడూరు మైనార్టీల్లో అత్యంత విశ్వాసపాత్రుడిగా దివంగత నేత వైఎస్ రాజశేఖరెడ్డికి, ఆయన తండ్రి వైఎస్ రాజారెడ్డికి అత్యంత గౌరవ ప్రీతిపాత్రుడిగా ముజీబ్ గుర్తింపు పొందారని, దాదాపు 3 సంవత్సరాలుగా పార్టీనే నమ్ముకొని పార్టీకి విధేయుడిగా పనిచేసిన నేపథ్యంలో ఎట్టకేలకు అబ్దుల్ ముజీబ్‌కు స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.

### ముజీబ్ పదవి పట్ల మైనార్టీల హర్షం

రైల్వేకోడూరు పట్టణంలోని వైసిపి నాయకులు అబ్దుల్ ముజీబ్ మైనార్టీలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక కావడం పట్ల రైల్వేకోడూరుకు చెందిన ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పార్టీలో ముజీబ్‌కు తనకంటూ ఒక ప్రత్యేకతను అలవరుచుకుని వీరవిధేయుడిగా వైఎస్ కుటుంబీకుల్లో ఈయనపై ఉన్న అభిమానం గుర్తించి ఎట్టకేలకు ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నేతృత్వంలో ఈయనకు పదవి రావడం కోడూరు ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బ్రహ్మంగారి మఠం, మే 17 ప్రభాతవార్త :



విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, గ్రంధాలయ ఇన్‌ఛార్జ్ అధికారి పి.అఫ్రిద్ పిలుపునిచ్చారు. బుధవారం బ్రహ్మంగారి మఠంలోని గ్రంధాలయం సమ్మర్ క్యాంప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అఫ్రిద్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుండి ప్రారంభమై జూన్ నెల 11వ తేదీ వరకు ఈ సమ్మర్ క్యాంప్ ఉంటుందన్నారు. విద్యార్థులు గ్రంధాలయానికి వచ్చి అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎండలో తిరగకుండా, సెల్ ఫోన్లతో కాలక్షేపం చేయకుండా సమ్మర్ క్యాంప్‌కు హాజరై పుస్తక పఠనం అలవరుచుకొని ఉన్నత విద్యావంతులు కావాలని విద్యార్థులతో ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణంపై సమీక్ష



దువ్వూరు, మే 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణం, ఇళ్ల నిర్మాణాలపై బుధవారం నియోజకవర్గం ప్రత్యేక అధికారి యధుభూషణ్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన గ్రామ సచివాలయాల వారీగా ఎన్ని ఇళ్లు కేటాయించారు. ఎన్ని ప్రారంభించారు. ఎన్ని గృహాలు పూర్తయ్యాయని బిల్లులు ఎంత మేర చెల్లించారు అని నివేదికలు అడిగారు. జగనన్న కాలనీలో పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నడూ లేని విధంగా జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని అందులో భాగంగా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకొనేలా ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ రమాకుమారి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏఈ శాంతి తదితరులు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

నందలూరు, మే 17 ప్రభాతవార్త



నందలూరు రైల్వేస్టేషన్ నందు నిలిచి ఉన్న కృష్ణపట్నం నుండి ఆర్‌టిపిపికి వెళుతున్న గూడ్సు రైల్లో ఉన్న బొగ్గులో అకస్మాత్తుగా మంటలు రావడంతో దానిని గమనించిన స్టేషన్ మాస్టర్ ఫైరింజన్‌కు, ఆర్‌పిఎఫ్ చంద్రనయాక్‌కు సమాచారం ఇవ్వడంతో నందలూరు పోలీసులు, ఫైరింజన్ వారు కలిసివచ్చి మంటలను ఆర్పి రైల్వేకి భారీ నష్టాన్ని కాపాడారు. ఎండాకాలంలో ఉన్న ఉష్ణోగ్రతలకు బొగ్గులో మంటలు వస్తాయని, వాటిని గమనిస్తూ రైలును గమ్యం చేర్చేబాధ్యత రైల్వేలో అందరిపై ఉందని ఆర్‌పిఎఫ్ చంద్రనాయక్ తెలిపారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకుండా కాపాడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## మహిళా సంఘాలను మెప్మా ఆర్పీలు బలోపేతం చేయాలి



కడప, మే 17 ప్రభాతవార్త :

మహిళా సంఘాల బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న మెప్మా ఆర్పీలు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ద్వారా.. నైపుణ్యాతను మరింత మెరుగుపరుచుకోవాలి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. సురేష్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూల సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారము కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100 మంది స్లం లెవెల్ సమైక్యల రీసోర్స్ పర్సన్స్ కు స్థానిక స్మిత్ రోడ్డు లోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ నందు జిల్లా స్థాయి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా పీడి వై. సురేష్ రెడ్డి ఆర్పిలను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టంగా చేపడుతున్న నవరత్నాల్లోని వైయస్సార్ ఆసరా, వైయస్సార్ సున్నా వడ్డీ, వైయస్సార్ చేయూత , టిడ్కోహౌసెస్ మరియు జగనన్న కాలనీలకు సంబంధించి విధివిధానాలను తెలుసుకొని లబ్ధిదారులైన సంఘ సభ్యులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చేయాలని, అలాగే మెప్మా కార్యక్రమాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించి సంస్థ ఉన్నతికి పాటుపడాలని తెలియజేశారు.ఈ రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి షెడ్యూల్ ప్రకారము కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దక్షిణ, పడమర పట్టణ సమైక్యలకు చెందిన ఆర్పిలు పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పనితీరుని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మెప్మా అధికారులు ఎఫ్రాయీమ్, గోపీనాథ్ డిఆర్పిల జోసెఫ్ చంద్ర శోభ మరియు వంద సమైక్యల నుండి ఆర్పీలు పాల్గొన్నారు.

## శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు మార్తల వెంకటకృష్ణారెడ్డి



రాయచోటి, మే 17 ప్రభాతవార్త :

2018 డిఎస్సి ద్వారా నియమించబడిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు మే 15 నుంచి ఐదు రోజులపాటు ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మార్తాల వెంకట కృష్ణారెడ్డి కోరారు. రాయచోటి మండలం ఏపీ మోడల్ స్కూల్ లో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను మీరు పాఠశాలకు వెళ్లి అమలుపరిచినట్లయితే విద్యార్థులకు సంపూర్ణమైన విద్యా బోధనను అందించిన వారు అవుతారని తెలియజేశారు. ఉపాధ్యాయులుగా మీరందరూ తప్పకుండా చక్కటి అభ్యసన కృత్యాలను ఆధారం చేసుకుని విద్యా బోధన చేసినట్లయితే ప్రతి విద్యార్థి మీరు చెప్పిన పాఠ్యాంశాన్ని అవగాహన చేసుకుంటారన్నారు. ఉపాధ్యాయుడు మంచి విద్య బోధన ద్వారా విద్యార్థులను ఆకట్టుకొని తన దారిలోకి తెచ్చుకోవాలని తెలియ చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా నిత్య విద్యార్థి లాగా ప్రతిరోజు సబ్జెక్టు మీద అవగాహన పెంచుకొని పాఠ్య బోధన చేయాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు తమ బోధించే సబ్జెక్టుతోపాటు పాఠశాలలో అమలు అయ్యే వివిధ రకాల పథకాల గురించి మరియు కార్యక్రమాల గురించి తెలుసుకొని పాఠశాలలో ఉండే ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు అందరూ కలిసి సమిష్టిగా కృషి చేసినట్లయితే ఎలాంటి సమస్యనైనా అధికమించవచ్చు అని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఈఓ పురుషోత్తం, ఉప విద్యాశాఖ అధికారిని వరలక్ష్మి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## స్పందనలో వచ్చిన అర్జీలను పరిశీలించిన సబ్‌కలెక్టర్



నందలూరు, మే 17 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి పరిధిలో అరవపల్లె గ్రామంలో ఉన్న సర్వేనంబరు 258లోని 28 సెంట్ల భూమి జంగిటి సుబ్బయ్య పేరుతో ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని కొందరు కబ్జా చేశారని బాధితులు సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌కు స్పందనలో ఇచ్చిన అర్జీ మేరకు బుధవారం నందలూరులోని సర్వేనంబరు 258ని పరిశీలించారు. ఇందులో 28 సెంట్లు భూమికి కాను ఐదు సెంట్లు కబ్జాకు గురైందని నిర్ధారణ అయిన నేపథ్యంలో దానిపై రెండు రోజుల్లో బాధితులకు సర్వేచేసి 5 సెంట్లు భూమి కూడా అతనికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తహశిల్దారు వై.ఎస్ సత్యానంద, మండల సర్వేయర్ ఓబయ్య, సచివాలయ సర్వేయర్ చంద్రబాబు అర్జీదారుడు, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌లు పాల్గొన్నారు.

## మోరగుడిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి



జమ్మలమడుగు, మే 17, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామ పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఈ కార్యక్రమానికి విచ్చేసిన భూపేష్‌రెడ్డికి స్థానిక నాయకులు శాలువా, పూలమాలలు వేసి బాణాసంచా పేలుస్తూ మోరగుడి మూడు రోడ్ల నుంచి మోరగుడి పెద్దమ్మ తల్లి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. భూపేష్ సమక్షంలో మోరగుడి గ్రామానికి చెందిన 400 కుటుంబాలు తెదేపాలో చేరారు. అనంతరం గ్రామ పెద్దమ్మకు, ఆంజనేయస్వామి గుడిలో టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెంచిన ధరల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాను గెలిపించాలని అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోరగుడి గ్రామ తెదేపా నాయకులు టంగుటూరి వెంకటరామిరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, కొండారెడ్డి, గని కొండారెడ్డి, రామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చిన్న నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, బాలిరెడ్డి, గ్యాస్ సత్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, ట్రాక్టర్ సత్య జయరాంరెడ్డి శేఖర్‌రెడ్డి, శేఖర్ (యలమంద), కుంటి లక్ష్మిరెడ్డి, సర్దార్ నర్సిరెడ్డి, సింగమాల జగ్గయ్య, శ్రీకాంత్, సీవీ దాసు, దనుంజయ, మాబాషా, గురుశంకర్, జింకా వెంకటరమణ, రఫీ, చంద్రశేఖర్‌రెడ్డి, పోతిరెడ్డి చిన్నవెంకట సుబ్బాంరెడ్డి, పెద్ద వెంకట సుబ్బారెడ్డి, చల్లా ఆదినారాయణరెడ్డి, మారంరెడ్డి బాలిరెడ్డి, నెమలి రాజారెడ్డి, సుబ్బరాజు, కంభం లక్ష్మణ్, కంభం మోహన్ దాసు, వెంకటేష్, ఎస్సీ కాలనీ ఇమ్మానియేల్, అనిల్‌కుమార్, వడ్డి సుబ్రమణ్యం, వడ్డి సుబ్బరాయుడు, పెద్ద మధు, చిన్న మదు, మోరగుడి భూపేష్ యువసైన్యం, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, జమ్మలమడుగు మండల మరియు టౌన్ తెదేపా నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

## నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

– నిరంతరం నిఘాతోనే నేరాలకు అడ్డుకట్ట – కడప డీఎస్పీ ఎండీ షరీఫ్



కడప క్రైం, మే 17, ప్రభాతవార్త:

నేరాలు జరగకుండా పోలీసు శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిఘాతోనే నేరాలకు అడ్డుకట్ట వేయగలమని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. కడప డీఎస్పీ కార్యాలయంలో బుధవారం పోలీసు కమాండ్ కంట్రోల్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రాత్రివేళల్లో కమాండ్ కంట్రోల్ సిబ్బంది విధుల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదని నిరంతరంగా పర్యవేక్షిస్తూనే ఉండాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరు కనపడినా వెంటనే పోలీసు స్టేషన్లకు వారిని అప్పగించాలని తెలిపారు. పోలీసు శాఖ గస్తీ ద్వారా చేపట్టిన చర్యలతోనే ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలు భరోసాతో ఉండగలరన్నారు. ఎటువంటి సమాచారాన్ని అయినా కూడా వెంటనే పోలీసు స్టేషన్లకు అందించి వారి భాగస్వామ్యాన్ని తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి, భావోద్వేగాలను అధిగమించాలి

డాక్టర్ హరిత



రాజంపేట అర్బన్, మే 17 ప్రభాతవార్త

విద్యార్థులు ప్రతిరోజు దినచర్యను క్రమం తప్పకుండా పాటించాలని మానసిక నిపుణురాలు డాక్టర్ హరిత పేర్కొన్నారు. ఒత్తిడి, భావోద్వేగాలను అదుపు చేయగలిగితే సక్సెస్ సొంతమవుతుందన్నారు. బుధవారం స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఎలాంటి పనైనా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఒక మంచి దృక్పథంతో చేయాలన్నారు. ప్రతి విషయాన్ని శ్రేయోభిలాషలతో పంచుకోవాలన్నారు. వ్యాయామంతో పాటు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా దృఢంగా బలపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎం.సుబ్బారావు ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ ఎస్.ఆర్.గౌతమి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య శ్మశాన వాటిక మౌళిక వసతులకు దాతల విరాళం అభినందనీయం

– ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు



బద్వేలు అర్బన్, మే 17 ప్రభాతవార్త :

పట్టణంలోని మైదుకూరు రోడ్‌లోని ఉన్న ఆర్యవైశ్య శ్మశాన వాటికలో మౌళిక వసతుల కొరకు దాతల సహకారం అభినందనీయమని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజా అన్నారు. బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త పరిటాల వెంకట సుబ్బయ్య 1,01,116 రూపాయలు విరాళం అందించేందుకు హామీ ఇస్తూ 50 వేల రూపాయలు నగదును ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజా, కమిటీ సభ్యులు సముద్రాల పుల్లయ్య చేతికి అందజేశారు. అలాగే రాఘవేంద్ర గ్రాండ్ ఫంక్షన్ హాల్ యజమాని యాదాళ్ళ తిమ్మరాజు కుమారులు జయసింహరాజు, డా॥ విజయసింహరాజు కుటుంబ సభ్యులు ఆర్యవైశ్య శ్మశాన వాటికలో మౌళిక వసతుల కోసం హామీ ఇచ్చిన 1,01,116 రూపాయలు మొత్తం నగదులో గతంలో ఇచ్చిన నగదుపోను మిగతా 50 వేల రూపాయలు అందజేశారు. అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి నాగరాజాలు మాట్లాడుతూ గతంలో ఆర్యవైశ్య శ్మశాన వాటికలో ఎవరైనా అకాల మృతిచెందినపుడు కనీస మౌళిక వసతులకు కూడా ఇబ్బందికరంగా ఉండేదని, అయితే పలువురు దాతల సహాయ సహకారాలతో ఆర్యవైశ్య శ్మశాన వాటికలో అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరి కొందరు ముందుకొచ్చి శ్మశాన వాటికలో మౌళిక వసతుల ఏర్పాటుకు సహకరించాలన్నారు. ఇప్పటి వరకూ చాలా మంది దాతలు ముందుకొచ్చి సహకరించడం వలన అవసరమైన మౌళిక వసతులు చేపట్టడం జరిగిందన్నారు. మరి కొన్ని నెలల్లోనే ఆర్యవైశ్య శ్మశాన వాటికలో అవసరమైన మౌళిక వసతులు ఏర్పాటును పూర్తి చేస్తామని వారు తెలిపారు.

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడుగా సత్యానాయుడు

– కర్ణాటక గెలుపుపై హర్షం




ఓబులవారిపల్లె, మే 17, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సత్యా నాయుడిని జిల్లా నాయకులు ఎంపిక చేసినట్లు చెంగయ్య తెలిపారు. 2 సంవత్సరాలుగా సత్యా నాయుడు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సహకరిస్తూ వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. అందువల్ల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన సూచించారు. అంతే కాకుండా ముందు ముందు కాంగ్రెస్ పార్టీ అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఇటీవల ఎన్నికల్లో కూడా అధికారం చేజిక్కించుకుందన్నారు. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుందన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లీలావతి, శ్రీకాంత్, ఓబులేసు, సుబ్బనరసయ్య, డా.సుబ్రమణ్యం, వెంకటరమణ, కిరణ్, పులి వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం పై విచారణ

పుల్లంపేట, మే 17 ప్రభాతవార్త



పుల్లంపేట మండలం టి. కమ్మపల్లె పంచాయతి కృష్ణంపల్లె గ్రామంలో ఇంటిస్థలం 25 సంవత్సరాలుగా ఉన్న వివాదం విషయంలో పుల్లంపేట తహశిల్దారు కుమార్ బుధవారం విచారణ నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన తులసిగారి ఆనంద్, మరొకరికి మూడున్నర సెంటు ఇంటిస్థలాన్ని 1999లో అప్పటి తహశిల్దారు పట్టాను మంజూరు చేయడం జరిగింది. రెండు తరాలుగా మా స్వాధీనంలో ఉన్నా వివాదం చేస్తున్నారని పుల్లంపేట తహశిల్దారుకు వినతిపత్రం అందజేయడంతో విచారణ చేపట్టారు. ఆ తర్వాత వివాదం కారణంగా కోర్టుకు వెళ్లడంతో కోర్టు పూర్తిస్థాయిలో ఇంజక్షన్ ఆర్డరు ఇచ్చినా మరో వ్యక్తి అడ్డు తగులుతున్నాడని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికే ఆ వ్యక్తి ఈ విధంగా చేస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. ఈ విషయాలపై బుధవారం తన సిబ్బందితో వెళ్లి ఆ స్థలాన్ని తహశిల్దారు పరిశీలించారు. ఆ పక్కనే వ్యవసాయ భూమి కొన్న ఓ వ్యక్తి అక్కడున్న ముస్లిం స్మశానం కూడా తన పట్టాలోనే ఉందని, స్మశానాన్ని స్వాధీనం చేసుకుని సాగులోకి తీసుకుస్తానని లేకుంటే ఖాళీ స్థలాన్ని అయినా స్మశానానికి బదులు ఇవ్వాలనే నెపంతో ఈ వివాదాన్ని సృష్టించడం వల్ల ఈ విచారణ చేయడం జరిగింది. అయితే ఈ విచారణలో 11 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఇంటిస్థలం కోసం కేటాయించారని, ఇందులో ఆనంద్, మరొకరికి సంబంధించిన రెండు తరాలుగా స్వాధీనంలో ఉన్న భూమిని మీకే కేటాయిస్తామని ఆనంద్‌కు తహశిల్దారు కుమార్ చెప్పడం జరిగింది. అయితే 11 సెంట్లలో ఎక్కడైనా ఇస్తాను, దానికి సమ్మతించాలని తహశిల్దారు షరతు పెట్టారు. ఒప్పుకున్న ఆనంద్ 25 సంవత్సరాలు పైబడి జరుగుతున్న వివాదానికి ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పడుతుందా అని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమికి పక్కనే కావాలనే స్మశానం కూడా కొనుగోలు చేసి వివాదం సృష్టిస్తున్న ఆ వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని ఆనంద్ ఈ సందర్భంగా తహశిల్దారును కోరారు.

## రైతులకు ఒక చట్టం కబ్జాదారులకు మరో చట్టమా

–లబోదిబోమంటున్న రైతు కుటుంబం

సుండుపల్లి, మే 17 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలోని మల్లక్కగారిపల్లికి చెందిన రెడ్డిచర్ల వెంకటరమణ అనే రైతు 81 సెంట్ల ప్రభుత్వ భూమిలో నాటిన మామిడి చెట్లను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించినట్లు తెలిపారు. లోకాయుక్త ఆదేశానుసారం 34 మామిడి చెట్లను కూకటివేళ్లతో పేకలించినట్లు రైతు ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు. సుండుపల్లి మండల కేంద్రంతో పాటు మండల కేంద్రానికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల కనుసనల్లో కబ్జాలకు గురవుతుంటే పట్టించుకోని రెవెన్యూ అధికారులు బోరు వేసి చెట్లు నాటి వ్యవసాయం చేస్తున్న రైతు చెట్లను తొలగించడం ఏమిటని గ్రామస్తులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన ఆర్ అండ్ బి రహదారికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలు, వంకలు, చెరువులు, గుట్టలు కబ్జాలకు గురవుతుంటే పట్టించుకోని అధికారులు రైతులపై పెత్తనం చెలాయించడం ఏమిటని పలువురు ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. రైతుకు ఉన్న స్థలం పక్కన కాస్తో కూస్తో ప్రభుత్వ భూమి వ్యవసాయానికి వినియోగిస్తే నేరం... ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల కనుసనల్లో అధికారుల సహకారంతో విక్రయాలు చేయడం నేరం కాదా అని రైతులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు. సుమారు రెండు సంవత్సరాలకు పైగా కన్నబిడ్డల్లా పెంచుకున్న మామిడి చెట్లను అధికారులు కనికరం లేకుండా ఓ నాయకుని మాటలు విని నరికేశారని రైతు బోరుమని విలపించారు.

## 31లోపల నవోదయ విద్యాలయాల్లో ప్రవేశపరీక్ష దరఖాస్తు చేసుకోండి

– జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్

రాయచోటి, మే 17 ప్రభాతవార్త :



జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం, నారం రాజు పల్లి (ఆకేపాడు)లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023 -2024 విద్యా సంవత్సరంలో 11వ తరగతి యందు ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయుటకు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో, అన్నమయ్య/ కడప జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుండి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు 31-05-2023 చివరి తేదీ అన్నారు. అలాగే 22-07-2023 తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా భావం అలవరుచుకోవాలి

– ఏపి స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ సుందరరామి రెడ్డి



బద్వేలు అర్బన్, మే 17 ప్రభాతవార్త :

నేటి సమాజంలో ప్రజల అవసరాల మేరకు ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని ఏపి స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ గుర్రంపాటి సుందరరామి రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ యర్రగొల్ల గోపాలస్వామి, వైసీపీ సీనియర్ నాయకులు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు సింగసాని శివయ్య, 12వ వార్డు ఇన్‌ఛార్జ్ తోటా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గూడెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బత్తల రాము యాదవ్, సతీమణి శ్వేత కుమార్తె నిహాశ్వి జన్మదిన సందర్భంగా మైదుకూరు రోడ్‌లోని చలివేంద్రం వద్ద సుమారు 500 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని పలువురు నాయకుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఏపి స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ గుర్రంపాటి సుందరరామి రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ యర్రగొల్ల గోపాలస్వామి, వైసీపీ సీనియర్ నాయకులు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు సింగసాని శివయ్య, 12వ వార్డు ఇన్‌ఛార్జ్ తోటా నాగేశ్వరరావులు మాట్లాడుతూ రోజు రోజుకూ అధికంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని శ్వేత అంబులెన్స్ యజమాని ఎ.వి.సుబ్బయ్య మనుమరాలు జన్మ దినోత్సవం పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టడం సంతోషకరం అని, అనంతరం పలువురు నాయకుల చేతుల మీదుగా బత్తల రాము కుటుంబ సభ్యులను సత్కరించి, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం శ్వేత అంబులెన్స్ యజమాని ఎ.వి.సుబ్బయ్య యాదవ్ మజ్జిగ వితరణ కార్యక్రమానికి విచ్చేసిన పలువురు వైసీపీ నాయకులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెక్కా అనిల్, ఉరిమి నాగేంద్ర, కనమర్లపూటి నాగేంద్ర, నేలపాటి బాబుతో పాటు పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లాక్డ్‌హౌస్‌మానిటరింగ్ సిస్టంను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు క్రైం, మే 17, ప్రభాతవార్త:

వేసవి సెలవులు సందర్భంగా విహార యాత్రలకు వెళ్లేటప్పుడు లేదా ఏదైనా శుభ కార్యాల కోసం మీరు మీ ఇళ్లు వదిలి వేరే ఊర్లకు వెళ్లానుకున్నప్పుడు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస) యాప్ ద్వారా సమాచారం ఇస్తే పోలీసులు దొంగతనాలు జరగకుండా పోలీసు నిఘా ఉంటుందని ఏఎస్పీ ప్రేర్ణకుమార్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పనులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



దువ్వూరు, మే 17, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు వాటికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండాలని పీడీ యధుభూషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఇందులో 2022,23లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి తమ నివేదికలను సమర్పించింది. నివేదికలో క్షేత్రస్థాయి సిబ్బంది మస్టర్ల నిర్వహణలో, ఇతర రికార్డులలో తప్పులు, కొట్టివేతలు ఉండడంతో ఆయన వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు ప్రజలకు, రైతులకు ఉపయోగంగా ఉండేలా చూడాలన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికను బృందం సభ్యులు అధికారులకు అందజేశారు. వాటిలో కొద్ది మొత్తాలు మాత్రం రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఉపాధి హామీ పథకంలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బుక్కాయపల్లె గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ తమకు సహకరించడం లేదని కేవలం ఒక వర్గానికే వత్తాసు పలుకుతున్నాడని మస్టర్లు ఇవ్వకుండా పనులకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తామని పీడీ తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా రికార్డుల నిర్వహణ చేపట్టారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, డీవీవో యోగాంజనేయరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ విజయభాస్కర్, ఏపీడీ శ్రీలక్ష్మీ, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఏపీవో రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

# వార్త 29వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక


వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 18 మే 2023








## భక్తుల కల్పవల్లి.... అనంతపురం గంగమ్మ తల్లీ..

-రాయలసీమకే తలమానికం..

అనంతపురం గంగమ్మ జాతమ్మజాతర

-భక్తుల కొంగుబంగారం..శ్రీఅనంతపురం గంగమ్మ తల్లి

-కోరినాకోర్కిలు తీర్చే కోంగుబంగారం.. శ్రీ అనంతపురం గంగమ్మ



అమ్మలగన్న అమ్మ ఇంటి ఇలవేల్పు మమ్మేలు మా తల్లి కరుణించు మ్మా..పిల్లా బిడ్డల కరుణించు కాపాడమ్మా.... వర బడిన వారికి వడి నింపమ్మా తల్లీ.. కోంగు బ ంగారమై నిల వాలమ్మా. కరుణించి కాపాడమ్మా శ్రీశ్రీశ్రీ అనం తపురం గంగమ్మ తల్లీ అంటూ వేనోళ్ల కోనియాడుతూ గంగమ్మ తల్లీకి భక్తులు అమ్మవారికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ప్రతి ఏడాది లక్కి రెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో కొలువై వున్న గంగమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించే గంగమ్మ జాతర రాయలసీమకే తలమానికంగా పేర్కొన వచ్చు. కొన్ని వందల సంవత్స రాల చరిత్ర కలిగిన గంగమ్మ జాతర రాయల సీమ జిల్లాలలోనే ప్రత్యేకతను సంతరించుకొవడాన్ని ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. బ్రిటిష్ హయంలోనే జాతరకు వేల సంఖ్యలో ప్రజలు వచ్చేవారు దీనిని దృష్టిలో ఉంచుకోని అప్పట్లోనే బారి బందోబస్తును ఏర్పాటు చేసి వారిని కడప గెజిట్‌లో పోందుపరచారు. చారి త్రక నేపద్యంలో ఉన్న జాతరలో ప్రసిద్ది చెందింది.ప్రతి ఏడాది మహాశివరాత్రి పండుగ ముగిసిన రోజే జాతరను ఘనంగా నిర్వహిస్తుంటారు. జాతరకు జిల్లా నుండే కాకుండా రాయలసీమలోని జిల్లాలైన అనంతపురం. కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, ఇతర జిల్లాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తుంటారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనం తపురం గ్రామంలో కొలువైన గంగమ్మకు అదే మండలం

కుర్నూతల గ్రామం చాగల గుట్టపల్లె గంగమ్మ పుట్టినిల్లుగా పూర్వీకులు చెబుతుంటారు. దీంతో కుర్నూతల- అనంతపురం గ్రామాలకు ఎంతో అవినాభావ సంబంధం వుంది. నిండు తిరు ణాల రోజు ముందు రాత్రి కుర్నూతల గ్రామంలోని చాగ లగుట్టపల్లెలో గంగమ్మ కు మొదటగా పూజలు నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి గంగమ్మను ఊరేగింపుగా 10 కిలోమీటర్ల దూరంలోని అనంతపురం గ్రామంలోని గంగమ్మ ఆలయానికి ఉదయం లోపల తీసుకువస్తారు. గంగమ్మ రాకతో అనం తపురం గ్రామంలో జాతర సంబరాలు మొదలవుతాయి. భక్తులు నిండు తిరుణాల రోజు రాత్రి తెల్లవారె వరకు అమ్మవారికి పూజలు జరుపుతుంటారు. మరుసటి మైలు తిరుణాల రోజు న ఉదయం జాతరలో అమ్మవారిని అంగరంగ వైభవంగా ఊరేగిస్తారు. అదే రోజు రాత్రి గంగమ్మ కుర్నూతల గ్రామం చాగలగుట్టపల్లెకు తిరుగు ప్రయాణం కావడంతో జాతర ము గిసినట్లు అవుతుంది. కాగా జాతరలో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి మొక్కులు చెల్లింపు చెప్పుకోదగ్గ విషయం. అమ్మ వారి జాతరలో పలుపూజలు ఇవేజాతర మొదలైనప్పటి నుంచి అమ్మవారికి మూడు రోజుల పాటు ప త్ర్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో ప్రధానంగా కల్లు స్యాంగం ప్రధా నమైంది. గౌడ (ఈడీగ) సామాజిక వర్గానికి చెందిన వారు కల్లు తీసుకొచ్చి అమ్మవారికి శాంతి చేస్తారు.ఆలయం ముందు వున్న మండపం యెక్క ప్రతేకృత ఏవరికైన భక్తులకు కడుపు నోప్పి వస్తే అ సత్రంలో పోర్లుతే కడుపు నోప్పి పోతుందని ఆమ్మ వారి పై దృడమైన నమ్మకం,ఆమ్మ వారికి ప్రతేక్యంగా సిద్దుల పూజా నిర్వహించి వరబడిన భక్తులకు ప్రసాదాన్ని పంచి పేడతారు.

### – గంగమ్మ జాతర చరిత్రలోకి వెళితే.....

కడప జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డి పల్లె మండలం అనంతపురం గ్రామానికి పూర్వం అనంత ఁపురం జిల్లా నుంచి ఎడ్లబండ్లలో గోనే సంచుల విక్రయించే వ్యాపారులు లక్కిరెడ్డిపల్లె మండలానికి వచ్చారంట వారితో పాటూ గంగమ్మ తల్లి బండిలో వచ్చినట్లు పెద్దలు చెబుతారు వారు పలు గ్రామాలు తిరిగి ఓ (గంగమ్మ జాతర) స్దలానికి చెరుకుంటారట. (మిగతా 3వ పేజీలో)














అన్నపూర్ణ స్టూడియోస్, క్యూబ్ సినిమా సంయుక్తంగా

# స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ వర్చువల్ ప్రొడక్షన్ స్టేజ్

ఇండియన్ మీడియా బిజినెస్ దిగ్గజాలు అన్నపూర్ణ స్టూడియోస్, క్యూబ్‌సినిమా .. ఈరెండు సంస్థలు సంయుక్తంగా హైదరాబాద్‌లో ది ఎఎన్నార్, వర్చువల్ ప్రొడక్షన్ స్టేజ్‌ను ఏర్పాటు చేశాయి. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఐసీవిఎఫ్ఎక్స్ (ఇన్‌కెమెరా విజువల్ ఎఫెక్ట్స్) వల్ల ఫిల్మ్ మేకర్స్





ప్రొడక్షన్ ప్రాసెస్‌ను సులభతరం చేయటానికి వీలవుతుంది. ఎఎన్నార్ వర్చువల్ ప్రొడక్షన్ స్టేజ్ ఈ విషయంపై 2022 అక్టోబర్ నుంచి రకరకాల ప్రయోగాలు చేస్తోంది.. ఇప్పటికే కొన్ని సినిమాలు యాడ్స్, మ్యూజిక్ వీడియోలను కూడ షూట్ చేసింది.. వాటన్నిటినీ పరిశీలించాక వర్క్‌ఫ్లో సొల్యూ షన్ నాణ్యత బాగుందని ఫిల్మ్ మేకర్స్‌కి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎలాంటి హద్దులు లేకుండా ఫిల్మ్ మేకర్స్ తమ క్రియేటివ్ గోల్స్ అచీవ్ చేయటానికి ఇది ఉపయోగపడుతుంది.. ఈసందర్భంగా క్యూబ్ సినిమా ఫౌండర్ పంచపకేశన్ మాట్లాడుతూ అన్నపూర్ణ స్టూడియోతోకలిసి పనిచేయటం ఆనందంగా ఉందన్నారు. మనదేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ ఉనన ఫిల్మ్ మేకర్స్ కోసం మేం ఈ అత్యాధునిక టెక్నాలజీని పరిచయంచేస్తున్నామని తెలిపారు.

# బిచ్చగాడు-2 ప్రీరిలీజ్ ఈవెంట్

విజయ్ అటోనీ స్వీయ దర్శకత్వంలో బిచ్చగాడు2 సినిమా మే19న విడుదల కానుంది.. అజయ్ అంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై ఫాతిమా విజయ్ అంటోనీ ఈసినిమాను నిర్మించారు.. విజయ్ అంటోనీకి జోడీగా ఈసినిమాలో కావ్యా థాపర్ నటించారు.. తెలుగులో ఈసినిమాను ఉషా పిక్చర్స్ బ్యానర్‌పై విజయ్‌కుమార్, వీరనాయుడు సంయుక్తంగా మే 19న భారీఎత్తున రిలీజ్ చేస్తున్నా రు. తాజాగా ఈచిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అడివి శేష్, ఆకార్‌పూరి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.. అడివి శేష్ మాట్లాడుతూ, ఉషా పిక్చర్స్ నాయుడు గారికి థాంక్స్ అన్నారు.. సురేష్‌గారు నా కెరీర్ ప్రారంభం నుంచి అండగా ఉన్నారని అన్నారు. బిచ్చగాడు సినిమాలో నంబర్




ప్లేట్ సీన్ నాకు చాలా ఇష్టం అన్నారు. ఈచిత్రం కోసం ఫాతిమా, విజయ్‌గార్లుచాలా ప్రాణంపెట్టి చేశారన్నారు.. కావ్య తెలుగులో చాలా పెద్ద హీరోయిన్ అవుతుందన్నారు. 19న బిచ్చగాడు 2 సినిమా థియేటర్లలో రాబోతోందని తెలిపారు. కార్యక్రమంలో విజయ్ అంటోనీ మాట్లాడుతూ, తెలుగుప్రేక్షకులు చూపిస్తున్న అభిమానానికి థాంక్స్ అన్నారు. కమర్షియల్ సినిమాలు తీయటం చాలా ఈజీ అనుకుంటారని, కానీ పూరి జగన్నాథ్‌గారు అద్భుతంగా తీస్తుంటారని అన్నారు. ఆయన కుమారుడు ఆకాష్‌పూరి ఇక్కడకు రావటం ఆనందంగా ఉందన్నారు.. ఈచిత్రం అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. ఫాతిమా విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, విజయ్ అంటోనీకి తెలుగు ప్రేక్షకుల నుంచి ఎక్కువ ప్రేమ వస్తుందన్నారు.. బిచ్చగాడు సినిమాను పెద్దహిట్ చేశారన్నారు.ఆడియెన్స్ ఆయన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ విజయ్, కావ్యా థాపర్, లిరిక్ రైటర్ భాషాశ్రీ తదితరులు మాట్లాడారు.

# 'తారంగ' రిలీజ్‌కు రెడీ



ఎస్ ఆర్‌కె ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న చిత్రం తారంగ.. షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ లో యూనిట్ మీడియాతోమాట్లాడింది.. సీనియర్ హీరో సుమన్ మాట్లాడుతూ ఈచిత్రం చాలా బాగా నచ్చిందన్నారు. తక్కువ సమయంలోనే చిత్రం పూరిచేసుకుని విడుదలకు సిద్ధమైందన్నారు.. ఈచిత్రం లో నిరా ్మత శ్రీనివాస్‌రెడ్డి ఒక మంచి పాత్ర పోషించారు.. ఈసినిమాలోకథ,మాటలు, ఫైట్స్ ప్రేక్షకులను రంజింపజేసేలా ఉన్నాయని అన్నారు.. హీరోలుగా నటించిన కట్ల ఇమ్మార్చెల్, కట్ల డాండి బాగా నటించారని అన్నారు. హీరోయిన్ కొత్త అమ్మాయి జా.నాగేశ్వరుని చాలా బాగా నటించిందన్నారు. ఈచిత్రం త్వరలోనే ప్రేక్షకులముందుకు రాబోతోందని అందిరికీ నచ్చేలా ఉంటుందన్నారు. సీనియర్ నటి కవిత మాట్లాడారు. జూలై నెలలో విడుదల చేయటానికి సన్నాహాలుచేస్తున్నామని నిర్మాత శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.




# 'బేబీ' మూవీ థర్డ్ సింగిల్

మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్కేఎన్ నిర్మాణంలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ తదితరులు నటిస్తున్న చిత్రం బేబీ... ఈచిత్రం నుంచి ఇప్పటికే రెండు పాటలు విడుదలై మంచి స్పందన అందుకున్నాయి.. ఇపుడు ప్రేమిస్తున్నా.. అనే మూడ పాటను తాజాగా విడుదలచేశారు. ఈపాటను నేషనల్ క్రష్ రష్మిక మందన్నా చేతులమీదుగా విడుదల



చేశారు.. కార్యక్రమంలోమారుతి మాట్లాడుతూ, ఒక్కోపాట, ఒకో క్క ప్రమోషన్ జనాల్లోకి రీచ్ అవుతోందన్నారు.. ఒక్కోపాటకు మిలియన్ వ్యూస్ వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి గొప్ప కంటెంట్‌ను సాయి రాజేష్ తీశారన్నారు. టీం అంతా కష్టపడుతోందని అన్నారు.. సందీప్‌రాజ్ మాట్లాడుతూ, ఇది నాకు ప్రత్యేకమైన ఈవెంట్ అన్నారు. యూనిట్‌కు ఆల్‌దిబెస్ట్ అన్నారు.. సాయి రాజేష్, రష్మిక మందన్నా, ఆనంద్ దేవరకొండ, నిర్మాత ఎస్కేఎన్, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య, సురేష్, ఎడిటర్‌విప్లవ్ నైషధం, సింగర్ శ్రీరామచంద్ర, రోహిత్, సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ తదితరులు మాట్లాడారు.

# తండ్రీ కొడుకుల ఎమోషనల్ జర్నీ



వీరయ్య అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్నా కొడుకుని మాత్రం ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఉంటాడు.. వీరయ్య కొడుక్కి మాత్రం విమానం ఎక్కాలని ఆలోచనలతోఎపుడూ తన చుట్టూ ఉన్నవారిని ప్రశ్నిస్తూనే ఉంటాడు.. తండ్రిని కూడ విమానం ఎక్కించమని బతిమాలుకుంటూ ఉంటాడు.. బాగా చదువుకుంటే నువ్వే విమానం ఎక్కవచ్చని కొడుకుతో అంటుంటాడు వీరయ్య. తండ్రీ కొడుకుల మధ్య అసలు ఈ విమానం సంగతి ఏంటి తెలుసుకోవాలంటే విమానం సినిమా చూడాల్సిందే అంటున్నారు మేకర్స్..తాజాగా ఈచిత్రం టీజర్‌ను విడుదల చేశారు. తండ్రి పాత్రలో సముద్రఖని నటించగా, కొడుకగా మాస్టర్ ధ్రువన్ చేశారు.

స్వప్న సినిమా నిర్మాణంలో నందిని రెడ్డి దర్శకత్వంలో రాబోతున్న రూపొందిన చిత్రం 'అన్నీమంచి శకుమనములే'.. సంతోష్ శోభన్,మాళవిక నాయర్ ప్రధానపాత్రల్లో నటించారు. మిత్ర విందా మూవీస్ తో కలిసి ప్రియాంకా దత్ ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.. మే 18న (గురువారం) ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.. ఈసందర్భంగా దర్శకురాలు నందినిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

# ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది....



**ఫీల్ గుడ్‌ఫ్యామిలీ సినిమా కనుక లైన్ పెద్దగా ఉండదు..ఈచిత్రాన్ని ఎలా కొత్తకోణంలో చూపించబోతున్నారు?**

ఇది కొత్త పాయింట్ నోడౌట్... అందులో రాయటానికి మంచి స్కోప్ ఉంది.. సంతోష్, మాళవికతోపాటు మిగిలిన పాత్రలకూ ప్రాధాన్యత ఉన్న కథ ఇది.. సహజంగా హీరోహీరోయిన్లకు ఫాదర్, మదర్ ఉంటారు. బొమ్మరిల్లులో ప్రకాష్‌రాజ్ పాత్ర. అన్నింటికీ ఇన్‌వాల్వ్ అవుతూ ఉంటుంది. అలాగే అన్ని మంచి శకునములే విషయానికి వచ్చేసరికి పాత్రలన్నీ తీసుకునే నిర్ణయాలకు కనెక్షన్ ఉంటుంది..విక్టోరియా పురం అనే ఊరి కథ. ఆ ఊరికి ఈ పాత్రలకు సంబంధం ఏంటి? లవ్‌స్టోరీకి ఏమిటి సంబంధం? ఇలా అన్ని లింక్‌తోనూ ఉంటాయి.. అసలు ఇలాంటి కథకు చాలా పాత్రలు ఉండటం వారికి తగిన న్యాయం చేయటం అనేదే గొప్ప ఛాలెంజ్.

**విక్టోరియా పురం అనేది కథకు ఏంటి సంబంధం?**

ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లో ఉన్నదే విక్టోరియాపురం.. కాఫీ తోటలకు ప్రసిద్ధి. అక్కడ చెఫ్ పెట్టే కాఫీని రాణి చాలా ఇష్టంగా తాగుతారు. అలా ఆ ఊరు ఫేమస్ అయ్యింది.. కాఫీ ఎస్టేట్, రెండు కుటుంబాలు, నాలుగు జనరేషన్స్,కోర్టు కేసు ఇలా అన్నిఅంశాలతో ఫ్యామిలీ ఎమోషన్స్‌తోప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటుంది.

**ఇందులోఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

కథకు కావాల్సిన అంశాలు ఉంటూ కథ జరిగే క్రమంలో అందరికీ ఎమోషన్ కనెక్ట్ అయ్యేలా ఉంటాయి... దాంతోపాటు ఎంటర్‌టైన్ చేశామాలేదా అనేది కూడ చూసుకుంటాను.. అందుకే అన్ని పాత్రలతో అల్లుకుపోతూ అందరినీ మెప్పించే ప్రయత్నం చేశా.. ఓ బేబీలో సెకండాఫ్ కీలకం.. ఇందులో అంతే ప్రేక్షకుల్ని టచ్ చేస్తుంది.

**రచయిత లక్ష్మీభూపాల్‌తో మీ జర్నీ?**

తను నా బ్రదర్ లాంటి వాడు. ఎమోషన్ సీన్స్ బాగా రాయగలడు.. నా సినిమాకు భూపాల్ ప్రేమతో రాస్తాడు.. కథ చర్చించుకున్నపుడు అంచనాల వేయగలడు. అంత ముందు చూపు ఉన్న తనకి.

**చాలా గ్యాప్ తర్వాత వాసుకి, షావుకారు జానకి, గౌతమి వంటి వారిని ఎంపిక చేసుకోవటానికి కారణం?**

వీరందరినీ కథ డిమాండ్ మేరకు తీసుకున్నాం రాజేంద్రప్రసాద్ లాంటి ఆర్టిస్టు ఉంటే వారిస్థాయికి తగినవారు కావాలి.. రావు రమేష్, నరేష్ వీళ్లంతా బిజీగా ఉన్నారు.. వారందరూ ఫ్యామిలీగా ఫీల్‌అయి ఈసినిమాను ఇంట్రెస్ట్‌తోచేశారు. ఇక మాళవిక మదర్ అంజుతో సహాకొత్తవారు అయితే స్క్రీన్‌పై ప్రేక్షకుడు ఎంజాయ్ చేస్తారని తీసుకున్నాం..

**దర్శకులుగా గ్యాప్ రావటానికి కారణం ఉందా?**

నాకు స్క్రిప్టును పూరీగారిలా స్పీడ్‌ఆ రాయటం కుదరదు.. సోలో రచయితగా రాస్తున్నపుడు టైం పడుతుంది.. అందుకే ఇపుడే రచయితల టీమ్‌ను పెట్టుకున్నాను.. ఈసినిమాకు నాకు మంచి ఫ్లాట్ దొరికింది. నాకు పెద్దగా గ్యాప్ అన్పించలేదు.. ఎందుకంటే ఆ గ్యాప్‌లో కథలు రాసుకున్నా..

**అన్నీ ఫ్యామిలీస్ ఫ్రెండ్లీ కథలేనా? కొత్తవి ఏమైనా చేస్తున్నారా?**

నా నెక్ట్స్ చిత్రం ఊహించని కథతో రాబోతున్నా.. వినూత్నంగా ఉంటుంది

# నరేష్ మళ్లీ పెళ్లి నుంచి మరో సాంగ్

సీనియర్ నటుడు నరేష్ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్టు మళ్లీ పెళ్లి హ్యూజ్ బజ్‌ను క్రియేట్‌చేస్తోంది.. యూనిక్ కథతో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో పవిత్ర లోకేష్ హీరోయిన్.. మెగా మేకర్ ఎమ్మెస్ రాజు రచన, దర్శకత్వం వహించారు. విజయకృష్ణ మూవీస బ్యానర్‌పై నరేష్ స్వయంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ప్రమోషన కార్యక్రమాలు జోరుగాసాగుతున్నాయి.. ఫస్ట్‌లుక్, గ్లింప్స్, టీజర్, పాటలు ఇలా ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి కావేరి గాలిలా పాటను విడుదల చేశారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. మనసును హత్తుకునే మెలొడియస్ ట్యూన్‌గా కంపోజ్ చేశారు. నరేష్‌అయ్యర్ ఆలపించిన ఈ పాటకు అనంతశ్రీరామ్ సాహిత్యం ఆకర్షణగా నిలిచింది.. సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్ కలిసి సంగీతం అందించారు.. జయసుధ, శరత్‌బాబు కీలకపాత్రల్లో కన్పించనున్నారు.. వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్‌న యండమూరి, మధు తదితరులు నటిస్తున్నారు. మే 26న ఈచిత్రం థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.






# జయతి ప్రధాన పాత్రలో 'నా ఫ్రెండ్‌దేమో పెళ్లి'

నివృతి వైబ్స్ మంచి వాల్యూస్‌తో ఆడియో, విజువల్ కంటె ంట్‌ను అందించటంలో ఎపటికపుడు తన ప్రతిభను నిరూపించు కుంటూనే ఉంది.. ఈ సంస్థ ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపా దించుకుంది.. గడచిన రెండేళ్లలో, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో 50కిపైగా మ్యూజిక్ వీడియో సాంగ్స్‌ను అందించింది.. ఇపుడు మరో తెలంగాణ జానపద పాట మ్యూజిక్ వీడియో గా వచ్చింది. నా ఫ్రెండ్ దేమో పెళ్లి.. అంటూ సాగే ఈ పాటలో జయతి ప్రధాపాత్రలో నటించింది.. బుల్లితెరపై వెన్నెల ప్రోగ్రామ్‌తో తిరుగులేని క్రేజ్, ఇమేజ్‌ను దక్కించుకున్న జయతి ఈ సాంగ్‌లో అద్భుతమైన హావ భావాలతో, మూమెంట్స్‌తో కట్టి పడేసింది.. ఈ మధ్యకాలంలో విడుదలైన సెన్సే షనల్ పాటలకు సంగీతాన్ని అందిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ బీమ్స్ సిసిరోలియో నా ఫ్రెండ్‌దేమో పెళ్లి. సాంగ్‌కు సంగీత సారథ్యం అందించారు.. శ్రావణభార్గవి అద్భుతంగా ఆల పించారు. యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ డిజిటల్ మాధ్య మంలో ఒక బిలియన్ వ్యూస్ ఉన్న ఫ్లాట్‌ఫామ్స్ నివృతి వైబ్స్ సొంతం చేసుకుంది.. 2024 పూర్తయే సరికి 150 పైచిలుకు మ్యూజిక్ వీడియో సాంగ్స్ ను అందించటానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.



# వార్త 29వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

## వృత్తి ఉపాధ్యాయుడు

### ప్రవృత్తి సామాజిక సేవ

### ఆపదవస్తే ఆదినే ముందు



రాజంపేట, మే 15 ప్రభాతవార్త :

ఎవరు ఎటుపోతే మనకేంటి ఎవరికి ఏ ఆపదవస్తే మనకెందుకు మొఖం చాటేసే వెళ్ళే నేటి సమాజంలో సామాజిక సేవ పట్ల కృషి చేసే వ్యక్తులను చూస్తే కేవలం వెళ్ల మీద చెప్పుకునే వారే ఉంటారు. మరి ప్రభుత్వ ఉద్యోగులైతే ఇలాంటి సేవలకు మరీ దూరం. ఇలాంటి సమాజంలో ఓ చిన్న పల్లెటూరు ప్రాధమిక పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు ఆపదలో ఉన్నవారిని చూస్తే గుండె తరక్కుపోయేలా అభిమానం చూపుతాడు. ఆయనే ఓబుళవారిపల్లె మండలంలోని అప్పగుంటపల్లె ఎస్టీ కాలనీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు గడ్డం ఆదినారాయణ రెడ్డి ఈయన వృత్తి ఉపాధ్యాయుడు అయితే ఆయన ఎంచుకున్న ప్రవృత్తి సామాజిక సేవే అని చెప్పవచ్చు. ఉపాధ్యాయులు వారి టైం వరకు పాఠాలు చెప్పి ఎప్పుడు ఎప్పుడు సమయం అయిపోతుందో అప్పుడు పరుగు పరుగున ఇంటికి పోదామనే ధోరణిలో ఉంటారు. ఇలాంటి సమాజంలో చిన్న పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడుగా పనిచేసే ఆదినారాయణ రెడ్డి సమయానికి గంట ముందే పాఠశాలకు వెళ్ళి విద్యార్థులతో మమేకమై విద్యా బోధనలు చేసి పాఠశాల సమయం అనంతరం పిల్లలతోనే అదనంగా మరో గంట పాఠశాలలోనే ఉండి కాలం గడుపుతారు. ఇదే కాకుండా సామాజిక సేవలో భాగంగా ఆపదలో ఉన్న పేదవారిని ఆయన శక్తి మేరకు ఆదరించి ఆదుకుంటారు. ప్రతి ఏటా బడికి నోచుకోని బడిఈడు పిల్లలను మండలంలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో అన్ని గ్రామాల్లో తానే స్వయంగా తిరిగి వారిని నియోజకవర్గంలోని కస్తూర్బా పాఠశాలలో చేర్పిస్తారు. ఇదే కాకుండా తల్లి దండ్రి లేని అనాథ పిల్లలను ప్రతి ఏటా మండలంలోని అనాథలను ఆదుకొనె ఆపద్బాంధులాంటి చిన్మయ ఆశ్రమంలోని పాఠశాలలో చేర్పించి వారిని అన్ని విధాల ఆదుకొని అలాంటి పిల్లలకు తల్లి దండ్రి లేని లోటు కూడా తీర్చి వారి చదువుల్లో భాగస్వాములు అవుతారు. ఇలాంటి అనాథ పిల్లలకు చదువుల అనంతరం ఆశ్రమం సహాయంతో ఈయన సొంత ఖర్చులు కొంత మేర వెచ్చించి అనేక మంది పెళ్ళీడు వచ్చిన అనాథ బాలికలకు పెళ్ళిళ్లు చేసిన ఘనత కూడా ఈయనకు ఉంది. ప్రతి ఏటా ఒక్కరిద్దరి పేద పిల్లలను దత్తకు తీసుకొని చదివించడం గత రెండు దశాబ్దాలుగా ఈయన చేస్తున్న పని ఇలాంటి సహాయ సహకారాలతో మండలంలోనే కాకుండా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతంలో కూడా చిన్నపిల్లలను మొదలు కొని వృద్ధుల వరకు టీచర్ ఆదినారాయణ రెడ్డి అంటే తెలియని వారు లేరు. ఈయనకు నాలుగు దఫాలుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. మూడు దఫాలు మండల ఉపాధ్యాయ సంఘ అధ్యక్షునిగా కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదే తరహాలోనే ప్రస్తుతం ఎ.పి. ఎస్టీయు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యదర్శిగా కూడా పనిచేస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం.

## భక్తుల కల్పవల్లి.... అనంతపురం గంగమ్మ తల్లీ..

అక్కడే ఉన్న పోలం కంచె వద్ద అమ్మవారు నిలచిపోయారని ప్రతీక. అంటారు తిమ్మిరెడ్డి ఉత్తా రెడ్డి తన పొలానికి క ంప తొడుగులు కొట్టించాడు. కొంత కాలం తరు వాత రెడ్డి తన పొలంలోని కంప తొడుగులను తోలమని కూలీలను పంపారు. కూలీలు కంప తొడుగులను తోలుతు న్నారు. అన్ని తోడుగులు తోలగా ఒక తోడుగు మాత్రం నిలిచి పోయింది. ఆ తోడుగును కూలీలు ఎంత లాగినా కదలలేదు. చివరకు మోకులు కట్టి తోడుగును లాగినా కూడా కదలలేదు. దీంతో దిక్కుతోచని కూలీలు విషయాన్ని పొలం యజమాని ఉత్తారెడ్డికి తెలిపారు. దీంతో ఆయన ఒక కాడి ఎద్దులను తొడుగుకు కట్టించి లాగినప్పటికి ప్రయోజనం లేకపోయింది. చివరకు 10 గాండ్ల ఎద్దులను కట్టి లాగినప్పటికి తోడుగు కదలలేదు. విధిలేని పరిస్థితిలో రైతు తోడుగును అలాగే వదిలేశాడు. కొంత కాలం తరువాత ఆ ప్రాంతంలో మేకలు మేపుతున్న బాలిక ముందు గంగమ్మ దేవత ప్రత్యక్షమై కంప తోడుగు వున్న ప్రాంతంలో తనకు గుడిని కట్టించి పూజారిని నియమించి ప్రతి ఏడాదికి తనకు జాతరను జరిపించాలని చెప్పి అదృశ్యమైనట్లు పెద్దలు చెబుతుంటారు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న గ్రామస్థులు కంప తొడుగులు వున్న ప్రాంతంలో బండ రాళ్ళను గుడి ఆకారంలో అమర్చి పూజలు ప్రారంభించారు. అప్పటి నుండి వరుసగా ప్రతి ఏటా మహాశి వరాత్రి పర్వదినం ముగిసిన రెండు రోజుల అనంతరం జాత రను నిర్వహిస్తూ రావడం అనవాయితీగా మారింది. తిరు ణాల మొదటి రోజును నిండు తిరుణాలగానూ, రెండవ రోజు ను మైలు తిరుణాల గానూ పేర్కొంటారు. మైలు తిరుణాల రోజు రాత్రి సమయంలో జాతర జరుగు ప్రాంతంలో ఎవ్వ రూ వుండరు. ఒకవేళ ఎవరైనా వుంటే వారు గంగమ్మకు ఆహూతి అవతారన్న దృఢమైన నమ్మకం భక్తులలో చోటు చేసుకొవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. సుమారు 50 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో కరువు కాటకాలు చోటు



చేసుకోవడం వల్ల ప్రజలు, పశువులు తీవ్ర అనారోగ్యాలకు గురి అవుతుంటే వారి బాధలను తీర్చేందుకు ఇక్కడ వెల సిందనే ప్రచారం కూడా వుంది. జాతర నందు భక్తులు అమ్మ వారికి వందలాది జంతువులను బలి ఇస్తుంటారు. బలి ఇచ్చి న జంతువుల రక్తాన్ని అన్నంతో కలిపి అమ్మవారి ముందు కంభం పెడతారు. జాతర సందర్భంగా భక్తులు చేసుకునే సం బరాలు అంబరాన్ని అంటుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. జాతరను పురష్కరించుకొని సంతానం లేని మహిళలు పిల్లల కోసం అమ్మవారి ముందు సిద్దలకు వరప డడం ప్రత్యేకం. జాతరలో వందలాది టెంకాయ బండ్లు, చాందినీ బండ్లు, తిడి మాను, కుంకుమబండ్లు అమ్మవారి చుట్టు ప్రదక్షిణలు చేయడం భక్తులను కనువిందు కలిగిస్తుంది. నిండు తిరుణాల రోజున జరిగే సంబరాలను ప్రత్యక్షంగా తిల కించే వారికి అందులో మజా తెలుస్తుంది. ముఖ్యంగా భక్తుల కొలాటాలు, చెక్కభజనలు, హరికథలు, బుర్రకథలు జాతర మారుమ్రోగుతుంది. మొత్తం మీద ఎంతో పురాతన చరిత్ర కలిగిన అనంతపురం గంగమ్మ జాతర సీమలో జరిగే గంగ జాతరలో అన్నింటిలో కంటే గొప్పదిగా చెప్పుకొవచ్చు.

**– జాతరకు చేరుకొవడానికి మార్గాలు:**

కడప, చిత్తూరుజాతీయ రహదారిలోని రామాపురం సమీపంలోని చిట్లూరు పడమర వైపు రోడ్డు నుంచి జాతరకు చేరుకొవచ్చు. లక్కిరెడ్డిపల్లె, రాయచోటి మార్గంలో కుర్నూతల క్రాస్ మర్రిచెట్టు వద్దవున్న తూర్పు వైపు నుండి జాతరకు చేరుకొవచ్చు. లక్కిరెడ్డిపల్లెలోని రామపురం రోడ్డు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం ఎదురుగా వున్న రోడ్డు నుంచి గద్ద గుడ్ల రాచపల్లె, ఈడిగపల్లె, చౌటపల్లె మార్గాల ద్వారా కూడా చేరవచ్చు.

## భక్తులకు పాపవినాశనం

మండల పరిధిలోని నగిరిపాడు పంచాయతి పెద్దూరు గ్రామం నుండి ఏడు కిలోమీటర్ల సమీపంలో దట్టమైన అడవి ప్రాంతంలో వెలి గొండల నడుమ వెలసిన గుండాల కోన కర్మాటేశ్వరుడు దర్శనం కోసం మహాశివరాత్రి పర్వదినాన స్వామి దర్శనంతో విముక్తి పొందాలన్న భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో మహాశి వరాత్రి పర్వదినాన వేకువజాము నుండే కాలిబాటన బయలుదేరి పొ ద్దు పొద్దు ఎర్రటి సూర్యుడు వెలు తురు నడుమ పచ్చటి అడవితల్లి పచ్చదనం మధ్య కిలకిల కోయిల రాగాల నడుమ నడిచి వెళ్లి కర్మాటే శ్వరుడి దర్శనంతో సర్వపాప వినా శనం. హరహర మహాదేవా అంటూ భక్తులు నినాదాలు చేస్తూ బయలు దేరుతారు. చిట్వేలి నుండి రైల్వేకో డూరుకు వెళ్లే దారిలో గుండాలకోన కు వెళ్లే ఊరు పెద్ద ఊరుగా పిలు స్తారు. అలాగే రైల్వేకోడూరు నుండి వచ్చేవారికి కూడ పెద్దూరు గ్రామం నుండి గుండాలకోనకు వెళ్లేందుకు అవకాశం ఉం ది. ఇటు నెల్లూరు జిల్లా, కడప జిల్లా, చిత్తూరు జిల్లాల నడుమ మధ్యలో కొలువుదీరిన స్వామిని దర్శించుకొనేందుకు, మొ క్కులు తీర్చుకొనేందుకు అటు కార్తీకమాస పర్వది నాల్లో భక్తులు వస్తూ ఉంటారు. మహాశివరాత్రి శుక్రవారాన్ని పురస్కరిం చుకొని భక్తులు గుండాల కోనకు పయనం కట్టారు. మరికొందరు భక్తులు గురువారం రోజు రాత్రికి స్వామివద్దకు చేరుకోవాలన్న లక్ష్యంతో కొందరు భక్తులు అక్కడ రాత్రికి నిద్ర చేసి ఉపవాసం ఉండి స్వామివారి దర్శనం చేసుకొంటారు. అక్కడికి వెళ్లిన భక్తులకు దట్టమైన అడవిలో పెద్దూరు గ్రామ ప్రజలు, కొందరు దాతలు గుండాలకోనలో సత్రాలను కూడ ఏర్పాటు చేశారు. విద్యుత్తు లేకపోయినా నడిచేందుకు సక్రమమైన రహదారి లేకపోయినా హరహర మహాదేవా శంభోశంకరా అంటూ పరమశివున్ని కొలుస్తూ ఆరాధిస్తూ అక్కడ ఉండడమే ఎంతో శ్రేయష్కరమని శివభక్తులు అంటున్నారు. ఎన్నో వందల సంవత్సరాల క్రితం అలనాటి రాజులకు అడవిలో వేటకు వెళ్లినప్పుడు పరమశివుడు కర్మాటేశ్వర అవతారంలో అలనాటి రాజులకు దర్శనమిచ్చారని పురాణాలు చెబుతున్నాయి. గుండాలకోనలో వెలసిన స్వామికి కుమ్మరపల్లెలో వెలసిన ఈశ్వరీదేవి రంగనాయకుల స్వామి ఆలయానికి ఎంతో దగ్గర సంబంధాలు కూడ ఉన్నట్లు, అలాగే అలనాటి లిఖించిన గ్రంధాలు కూడ రంగనాయకులస్వామిమఠంలో ఉన్నట్లు ఆ



ప్రాంత ప్రజలు, భక్తులు స్వామివారి గురించి కథలు కథలుగా చెబుతారు. ఇదిలా ఉండగా గుండాలకోనకు వెళ్లే భక్తులు ఆ కుటుంబంలో పిల్లాపాపలు కలగక ఆ కుటుంబానికి సంతాన భాగ్యం కలగనివారు అక్కడికి వెళ్లి కర్మాటేశ్వరున్ని వరపడితే ఆయన సంతానాన్ని ప్రసాదిస్తారని ఈ ప్రాంత ప్రజల ప్రగాఢ నమ్మకం. ఎత్తైన కొండల నడుమ పచ్చని పందిరిలా అలముకొన్న అడవితల్లి నడుమ ఎంత కరవు కాటకం వచ్చి నా స్వామివారు కొలువుదీరిన పేటు కింద ఎప్పుడూ నీళ్లు ఉండడం, అ లాగే స్వామికొలువుదీరిన పక్కనే గుండంలో నీరు ఉండడం, ఆ ప్రాం త విశేషంగా భావిస్తారు. కరవు కా టకాలతో గ్రామాలు అల్లాడుతున్నా ఆ ప్రాంతంలో మాత్రం నీటికొరత భక్తులకు కనపడదు. అదే స్వామివారి మహత్యంగా గుండాలకోన చరిత్ర కథలు కథలుగా ఈ ప్రాంత ప్రజలు చెప్పు కొంటూ ఉంటారు. ఈ యేడాది మహాశివరాత్రిని పురస్కరించుకొని పెద్దూరు గ్రామ ప్రజలు కర్మాటేశ్వరుడికి గుండాలకోనలో కళ్యాణమహోత్సవం నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీరు, వసతి కల్పిస్తూ స్వామివారి సేవలో తరించాలని భక్తులు స్వామిని దర్శించుకొనేందుకు కదలివస్తున్న వారికి సౌకర్యాలు కల్పిస్తూ ఆ గ్రామ ప్రజలు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి పవిత్ర పుణ్యజలం ఉన్న గుండంలో స్నానమాచరించి వరపడే భక్తులు పొంగుబాళ్లు పెట్టి స్వామివారికి నైవేద్యం సమర్పించి వరపడే భక్తులు మహాశివరాత్రి పర్వదినాన వేలమంది భక్తుల శివనామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగుతుంది. వెలిగొండుల నడుమ వెలసిన స్వామివారిని దర్శించుకవాలని పెద్దూరు గ్రామ ప్రజలు, పెద్దలు కోరతూ ఉన్నారు.












## అనాథలకు అండగా వివేకానంద సేవాశ్రమం





పోరుమామిళ్ళ రూరల్, మే 17 ప్రభాతవార్త :

కష్టాలు కొందరిని క్రూరమైన మనస్తత్వం కలవారిగా మారుస్తాయి. మరికొందరిని మానవత్వం వైపు నడిపిస్తాయి. రెండోకోవకు చెందినవాడే యువకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి. కడప జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన నిరుపేద రైతుకుటుంబంలో జన్మించాడు. గ్రామీణ నేపథ్యం లో పెరిగి, పేదరికంతో పోరాడుతూ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఈ క్రమంలో ఆయన జీవితంలో ఎదురైన కష్టాలు ఆవేదనను రగులుస్తూ ఆలోచనను రేకెత్తించాయి.. ఈక్రమంలో ఒకగురువు ఆయనకు స్వామివివేకానంద జీవితాన్ని గురించి, యువత కోసం ఆయన పడ్డ ఆవేదన గురించి వివరించాడు. ఆక్షణమే రామకృష్ణారెడ్డి జీవితం మలుపు తిరిగింది. కొంతమంది యువకులను తోడుచేసు కొని 2010 వ సంవత్సరం జనవరి 12వ వ తేదీ న వివేకానం ద ఫౌండేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థ స్థాపించి కొన్ని వందల పాఠశాలల్లో వేలమంది పిల్లలకు విద్యాపరంగా తమకు చేతనైన సహాయాలు చేశాడు. ఇలాంటి సమయంలో తనకు రైల్వేశాఖలో చిన్న ఉద్యోగం రావడంతో జీతంలో సగభాగాన్ని సేవ కోసం కేటాయించసాగాడు. దీనితో పాటు రక్తదానాలు, కరోనా వల్ల మరణించినవారి దహనసంస్కారాలు చేశాడు. ఒకసారి పోరుమామిళ్ళలో రోడ్డుపక్కన బస్ షెల్టర్ లో గాయాలతో పురుగులు పట్టి దుర్వాసన తో ఉన్న ఒకవ్యక్తిని చూసి చలించిపోయాడు. గాయాలను శుభ్రంచేసి ఏదైనా అశ్రమంలో చేరుద్దామని ప్రయత్నిస్తే సాధ్యం కాలేదు. ఆక్షణమే నిర్ణయించుకున్నాడు ఇలాంటి వారికోసం, పూర్తి నిరాదరణకు గురైన అనాథల కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపిం చాలని. ఆశయం ఉంది, ఆర్థిక స్తోమత లేదు. ఇలాంటి తరు ణంలో ఒక మానవతావాది ఓబుళాపురం దగ్గర సగిలేరు నది ఒడ్డున ఎకరా పొలాన్ని విరాళంగా ఇవ్వడంతో వివేకానంద సేవాశ్రమానికి పునాది పడింది. ఒక్కొక్కరుగా దాతలు సహ కరించసాగారు. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ, దాతలనుంచి సాయం తీసుకుంటూ రెండు గదులు నిర్మించి 2021 జనవరి 12 న వివేకానంద సేవాశ్రమం ప్రారంభించాడు. కన్నబిడ్డలు ఉండి కూడా ఆశ్రమంలో చేరినవారిని కౌన్సెలింగ్ ద్వారా ఇప్పటివరకు 22 మందిని కుటుంబాలకు అప్పగిం చాడు. 11 మంది అనారోగ్యంతో మరణిస్తే అన్నీ తామై సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేశాడు. ఇప్పుడు 15 మంది అభాగ్యులు ఆశ్రయం పొందుతున్నారు. ఇందులో పూర్తిగా నిరాదరణకు గురైన వారు, అనారోగ్యంతో బాధపడు తున్న వారే వున్నారు. ఆశ్రయం కోరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఇంకాకొన్ని గదుల నిర్మాణం మొదలు పెట్టాడు. దీనికి కొందరు దాతలు సాయం చేసినప్పటికీ కొందరు హామీ ఇచ్చి కరోనా వల్ల ఆదాయమార్గాలు తగ్గిపోవడంతో చేయలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్పుచేసి మరీ నిర్మాణాన్ని కొనసాగించాడు. అశ్రమంలో వృద్ధులకు అన్నం పెట్టడంతో పాటు ఆప్యాయతను, ఆహ్లాదాన్ని పంచాలన్నది రామకృష్ణారెడ్డి కోరిక. ఆప్యాయతను పంచేక్రమంలో ఈయన సతీమణి రామతులసి నిత్యం వృద్ధులతోనే వుంటూ బాగోగులు చూసుకుంటూ స్త్రీలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆహ్లాదాన్ని పంచాలని ఆశ్రమప్రాంగణమంతా మొక్కలు, పక్షులు పెంచుతూ వృద్ధులకు ఆనందాన్ని కలిగిస్తున్నాడు. ముఖ్యంగా అనారోగ్యంతో నడవలేక మంచానికే పరిమితమైన వారికోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసి వారికి పెద్ద కొడుకు గా అండగా నిలుస్తున్నాడు. ఆశ్రమంలో ఇంకా కొన్ని నిర్మాణం పనులు చేయవలసి ఉంది, దాతలు సహకరిస్తే కనీసం 60 నుంచి 100 మందివరకు ఆశ్రయం ఇవ్వొచ్చు.











